ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

అన్నమయ్య

జిల్లా వార్తలు

5 గురువారం 4 జనవరి 2024



కలెక్టర్ కార్యాలయంలోకి దూసుకెళ్తున్న అంగన్వాడీలను అడ్డుకుంటున్న పోలీసులు



రాయచోటిలో జాతీయ రహదారిపై కూర్చుని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

ముట్టడి.. కట్టడి..

- దద్దరిల్లిన కలెక్టరేట్
- అంగన్వాడీలు, సమగ్ర శిక్ష ఉద్యోగులు.. ఉపాధ్యాయుల ఆందోళన
- అంగన్వాడీల కలెక్టరేట్ ముట్టడి యత్నం
- అడ్డుకున్న పోలీసులు
- కలెక్టరేట్ గేటు వద్ద ఉద్రిక్తత

రాయచోటి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కార్మికులు, సహాయకులు, సమగ్ర శిక్ష ఉద్యోగులు, ఉపాధ్యాయులు వేలాది మంది ఆందోళనకు దిగడంతో కలెక్టరేట్ బుధవారం ధర్నాలతో దద్దరిల్లింది. ఉదయం నుంచి కలెక్టరేట్ ఎదుట పోలీసులు, ఉద్యమకారులతో నిండిపోయింది. కలెక్టరేట్ ముట్టడికి వస్తున్న అంగన్వాడీలను ఎక్కడికక్కడ పోలీసులు కట్టడి చేశారు. బస్సుల్లో తరలివస్తున్న వారిని రాయచోటికి రాకుండా అడ్డుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. 23 రోజులుగా అంగన్వాడీ కార్యకర్తలు తమ సమస్యల సాధన కోసం సమ్మెలో ఉన్నారు. అయినా ప్రభుత్వం వీళ్ల సమస్యలు పరిష్కారానికి కృషి చేయకపోడంతో వివిధ రూపాలలో ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించి బుధవారం కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిచ్చారు. దీంతో పోలీసులు బుధవారం తెల్లవారుజాము నుంచే సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులను అరెస్టు చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాజెక్టుల నుంచి అంగన్వాడీ కార్యకర్తలు రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. మదనపల్లె, తంబళ్లపల్లె, బి.కొత్తకోట, రాజంపేట, రైల్వేకోడూరు ప్రాజెక్టుల నుంచి అంగన్వాడీ కార్యకర్తలు కలెక్టరేట్ ముట్టడికి రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. వారు ప్రయాణిస్తున్న వాహనాలను నిలిపేశారు. దీంతో ఎక్కడికక్కడే అంగన్వాడీలు ఆందోళనకు దిగారు కలెక్టరేట్ ఎదురుగా జాతీయ రహదారిపైన అంగన్వాడీలు ధర్నాకు దిగారు. రాయచోటి, లక్కిరెడ్డిపల్లె ప్రాజెక్టుల నుంచి అంగన్వాడీలు హాజరయ్యారు. 11 గంటల సమయానికి పెద్ద సంఖ్యలో అంగన్వాడీలు గుమికూడారు. సాయంత్రం 4 గంటల వరకు అంగన్వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఆ తర్వాత కలెక్టరేట్ ముట్టడికి ప్రయత్నించారు. అయితే పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు అడ్డుకుని కలెక్టరేట్ ముట్టడిని భగ్నం చేశారు.దీంతో అంగన్వాడీలు కలెక్టరేట్ గేటు వద్ద ఆందోళనకు దిగారు. అంతకు ముందు అంగన్వాడీ కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ సంఘాలు ఐక్యంగా ఈ ఆందోళనలో పాల్గొన్నాయి. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ అధ్యక్షురాలు శ్రీలత, సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌తో పాటు సీపీఎం నాయకులు రామాంజులు, సీపీఐ నాయకులు విశ్వనాధ్‌నాయక్‌తో పాటు పలువురు అంగన్వాడీ నాయకురాళ్లు పాల్గొన్నారు.

15వ రోజుకు సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మె

సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె బుధవారానికి 15వ రోజుకు చేరుకుంది. కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో సమగ్ర శిక్ష ఉద్యోగులు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేసి, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున సమగ్ర శిక్ష ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాలు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా

యూటీఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు బుధవారం కలెక్టరేట్ ఎదుట 12 గంటల పాటు ధర్నాను నిర్వహించారు. ధర్నాలో పలువురు ఉపాధ్యాయ, ఉద్యోగులు పాల్గొన్నారు. డీఏ అరియర్లు, పీఆర్‌సీ అరియర్లు, పీఎఫ్ లోన్లు, ఏపీజీఎల్ఐ అమౌంటు అన్నీ కలిపి సుమారు రూ.19 కోట్ల వరకు బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలని, అంతవరకు 30 శాతం ఐఆర్‌ను ఇవ్వాలని, గత పీఆర్‌సీ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా నాయకులు హరిప్రసాద్, జాబీర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఆందోళనలకు బాలసుబ్రహ్మణ్యం సంఘీభావం

అంగన్వాడీలు, సమగ్ర శిక్ష ఉద్యోగులు, యూటీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఉపాధ్యాయ, ఉద్యోగుల ఆందోళనలకు రాజంపేట పార్లమెంటు తెలుగుదేశం పార్టీ నాయకుడు సుగవాసి సుబ్రహ్మణ్యం తన సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం తన మొండి వైఖరి వీడి ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



సమగ్ర శిక్ష ఉద్యోగులకు మద్దతు తెలుపుతున్న రాజంపేట పార్లమెంట్ టీడీపీ నాయకుడు బాలసుబ్రహ్మణ్యం



నిమ్మనపల్లె పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన చేస్తున్న అంగన్వాడీలు



మదనపల్లెలో తాలూకా పోలీసుస్టేషన్‌లో అంగన్వాడీల ధర్నాకు మద్దతిస్తున్న కాంగ్రెస్ నాయకులను లాగేస్తున్న పోలీసులు

చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన అనంతరం మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి



పసుపు కండువా కప్పుకున్న ద్వారకనాథరెడ్డి

- చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరిక

రాయచోటి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకుడు గడికోట ద్వారకనాథరెడ్డి బుధవారం సాయంత్రం విజయవాడలో చంద్రబాబు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆయనతో పాటు ఆయన సోదరుడు సురేంద్రరెడ్డి కూడా టీడీపీలో చేరారు. 1994లో లక్కిరెడ్డిపల్లె నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనంతరం ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. వైసీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో కొనసాగుతున్నారు. వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డికి ఈయన స్వయానా బావమరిది కావడంతో.. ఈయన టీడీపీలో చేరడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించింది. రాయచోటి టిక్కెట్‌ను ద్వారకనాథరెడ్డి ఆశిస్తున్నారు. రామాపురం, లక్కిరెడ్డిపల్లె, గాలివీడు మండలాల్లో ఈయనకు అనుచర గణం ఉంది. అదే సమయంలో రాయచోటి మునిసిపాలిటీ, రూరల్ మండలం, చిన్నమండెం, సంబేపల్లె మండలాల్లో ఈయనకు బంధువర్గం, పరిచయాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈయన టీడీపీలోకి రావడం ఆ పార్టీకి ఉపయోగకరంగా ఉంటుందని పలువురు రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. కార్యక్రమంలో పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు, టీడీపీ నేత మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి సదరమ్ స్లాట్ బుకింగ్ ప్రారంభం

కలికిరి, జనవరి 3: దివ్యాంగుల సర్టిఫికెట్ల జారీకి గురువారం నుంచి సదరమ్ కేంద్రాల ఎంపిక కోసం స్లాట్ బుకింగులు ప్రారంభం కానున్నాయి. జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించిన స్లాట్ బుకింగ్‌ల ద్వారా సదరమ్ కేంద్రాలను ఎంపిక చేసుకునే వీలుంది. సదరమ్ కేంద్రాల్లో దివ్యాంగులకు అవసరమైన పరీక్షలు నిర్వహించి వైకల్య స్థాయిని నిర్ధారిస్తూ సర్టిఫికెట్లు జారీ చేయనున్నారు. దివ్యాంగులు తమకు అనువైన తేదీలను, పరీక్షా కేంద్రాలను ఎంపిక చేసుకుని స్లాట్ కేటాయించుకోవచ్చు. ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, బస్సులు, రైళ్లలో ప్రయాణాలు, సామాజిక పింఛన్లు తదితర సంక్షేమ పథకాల్లో లబ్ధి పొందేందుకు సదరమ్ కేంద్రాలు జారీ చేసే ధృవపత్రాలు మాత్రమే ప్రామాణికమవుతాయి. జిల్లాలోని ఏరియా, జిల్లా ఆసుపత్రుల్లో సదరమ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. దివ్యాంగులకున్న శారీరక, మానసిక, నేత్ర వైకల్యాలకు సంబంధించిన స్థాయిని నిర్ధారిస్తూ ఈ సదరమ్ సర్టిఫికెట్లు జారీ చేస్తారు. సదరమ్ కేంద్రాల్లోని నిపుణులైన వైద్యులు అవసరమైన పరీక్షలు జరిపి ధృవపత్రాలు జారీ చేయనున్నారు. స్థానికంగా సచివాలయాలు లేదా మీసేవా కేంద్రాల ద్వారా సదరమ్ స్లాట్‌ను పొందవచ్చు.

పేద ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

- జిల్లాలో 1,88,272 మందికి రూ.3 వేలు పింఛన్ల పెంపు
- జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 3: పేద ప్రజల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. బుధవారం కాకినాడ నుంచి రాష్ట్రవ్యాప్తంగా జనవరి 1 నుంచి పెంచిన పింఛన్ల లబ్ధిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి వర్చువల్ విధానంలో లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఇందులో భాగంగా జిల్లాలోని 3210 మందికి కొత్తగా పింఛన్లు, 1,88,272 మందికి రూ.2750 నుంచి రూ.3 వేలు పెంపుదలతో మొత్తంగా 2,26,790 మందికి రూ.67.31 కోట్ల లబ్ధి చేకూరింది. రాయచోటి కలెక్టరేట్ స్పందన హాల్‌లో ఏర్పాటు చేసిన ఈ వర్చువల్ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పేద ప్రజలను ఆర్థికంగా ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జేసీ తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న ప్రజలు

- నదిలోనే వంటావార్పు
- ఇసుక తవ్వకాలు ఆపేవరకు పోరాటం చేస్తామంటున్న ప్రజలు



పాపాఘ్ని నదిలోనే వంటలు చేసుకుంటున్న జంబుగానిపల్లె గ్రామస్థులు

పెద్దతిప్పసముద్రం, జనవరి 3: పీటీఎం మండలంలోని టి.సదుం పంచాయతీ జంబుగానిపల్లె వద్ద గల పాపాఘ్ని నదిలో అక్రమంగా ఇసుకను తరలిస్తుండటంతో గ్రామస్థులంతా మూకుమ్మడిగా బుధవారం నదిలోకి చేరుకుని ఇసుక రవాణాను అడ్డుకున్నారు. నదిలోనే వంటావార్పు చేసుకుని అక్కడే కూర్చున్నారు. ఇక్కడి నుంచి ఇసుకను తరలించడం వెంటనే ఆపాలని తెలిపారు. మండల కర్ణాటక సరిహద్దు టి.సదుం పంచాయతీ పరిధిలోని రామాపురం ఇసుక రీచ్ నుంచి ఇసుక తవ్వకాలను పరిధికి మించి పాపాఘ్ని నది పొడవునా అక్రమంగా చేస్తున్నారు. ఇది నియోజకవర్గ ముఖ్యనేతకు సంబంధించిన వ్యవహారం కాబట్టి, అధికారులు, స్థానికులు ఏళ్ల తరబడి పట్టించుకోలేదు. ఓపిక నశించిన జంబుగానిపల్లె గ్రామస్తులు డిసెంబరు 25న తిరబడి ఇసుక తవ్వకాన్ని అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు అక్కడికి వెళ్లి వారికి సర్ది చెప్పి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో బుధవారం మరోసారి జంబుగానిపల్లె గ్రామస్థులు నదిలో ఇసుకను తోడే యంత్రాలను అడ్డుకున్నారు. గ్రామస్తులందరూ కలసి అక్కడే వంటలు చేసుకుని ఇసుకలోనే బైఠాయించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ, ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన పోలీసులు, రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ విద్యాసాగర్ అక్కడికి వచ్చి గ్రామస్థులతో మాట్లాడుతుండగా రెవెన్యూ అధికారులు ఇసుకాసురులకు లోబడి పనిచేస్తున్నారని, రైతుల గోడు పట్టించుకోకుండా అక్రమార్కులకు ఎలా సహకరిస్తారని నిలదీశారు. క్వారీ ఉండేదెక్కడ, సర్వే నెంబరు ఏది, అనుమతి పొందిన విస్తీర్ణం ఎంత, జంబుగానిపల్లెకు ఇసుక రీచ్ అనుమతికి సంబంధం ఏమిటి అని గ్రామస్థులు అడిగిన ప్రశ్నలకు మైనింగ్ అధికారులు, పోలీసులు, తహసీల్దార్ నీళ్ల నమిలారు. అధికారుల నుంచి ఇసుకను ఆపుతాం అనే మాటే రాకపోవడంతో పిల్లలతో సహా ఇక్కడే వంట చేసుకుని ఇక్కడే జీవనం చేస్తామంటూ వారు అక్కడే కూర్చున్నారు. దీంతో అధికారులు అక్కడి నుంచి వెనుదిరిగారు. కాగా గ్రామస్థులు కొందరు కర్నూలులోని లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. లోకాయుక్త జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి ఈ ఇసుక అక్రమ రవాణాపై పూర్తి నివేదికను ఫిబ్రవరి 22వ తేదీ లోపు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిసింది.

సిరికల్చర్ ఏడీకి ఓడీవోపీ జిల్లా అవార్డు

మదనపల్లె అర్బన్, జనవరి 3: జిల్లా సిరికల్చర్ ఏడీ శ్రీనివాసులురెడ్డికి ఓడీవోపీ (వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్) డిస్ట్రిక్ అవార్డును బుధవారం కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్‌గోయల్, కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జయశంకర్‌లు న్యూఢిల్లీలోని ప్రగతి మైదానం భారత్ భవనంలో అందజేశారు. ఈ సందర్భంగా ఏడీ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఈ అవార్డు మన జిల్లా చేనేత ఉత్పత్తి అయిన మదనపల్లెకు దక్కడం గర్వకారణమన్నారు. ఓడీవోపీ జిల్లా అవార్డులు దేశవ్యాప్తంగా ఆరు అంతర్జాతీయ స్థాయిలో, ఎనిమిది రాష్ట్రస్థాయిల్లో, పది జిల్లా స్థాయిలో ప్రధానం చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ప్రతినిధులు మదనపల్లెలో పరిశీలించి జిల్లా కలెక్టర్‌తో సంప్రదించి అవార్డుకు ఎంపిక చేశారన్నారు. మదనపల్లె చేనేత పట్టుచీరలను కలెక్టర్ నిర్ణయం మేరకు ఓడీవోపీ ఉత్పత్తిగా గుర్తించడం చాలా సంతోషంగా ఉందన్నారు.



అవార్డు అందుకుంటున్న సిరికల్చర్ ఏడీ శ్రీనివాసులురెడ్డి

నంద్యాల డెమో ఎక్స్‌ప్రెస్ రేణిగుంట వరకు పొడిగింపు

నందలూరు, జనవరి 3: నంద్యాల నుంచి కడప వరకు ప్రస్తుతం నడుస్తున్న 07284 డెమో ఎక్స్‌ప్రెస్‌ను రేణిగుంట వరకు ఈనెల 6వ తేదీ నుంచి పొడిగించినట్లు సమాచారం. ఉదయం 5.40 గంటలకు నంద్యాలలో బయలుదేరే ఈ రైలు కడపకు ఉదయం 9.30 గంటలకు చేరుకుని సాయంత్రం 5 గంటల పది నిమిషాల వరకు కడప రైల్వేస్టేషన్‌లోనే వేచి ఉండేది.

ప్రస్తుతం ఈ ట్రైన్‌ను రేణిగుంట వరకు పొడిగించడంతో తిరుపతి వెళ్లే ప్రయాణికులకు సౌకర్యంగా ఉండనుంది.

తుస్సుమన్న బస్సు యాత్ర

- నాయకులు ప్రసంగిస్తుండగానే జనం పలాయనం
- మూడు గంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం
- ప్రయాణీకులకు తప్పని పాట్లు
- ప్రైవేటు స్కూళ్ల బస్సుల్లో జనాల తరలింపు
- భోజనాల వద్ద తోపులాట.. ఇక్కట్లు పడిన మహిళలు



సభ మధ్యలోనే జనాలు లేక ఖాళీ అయిన కుర్చీలు

రైల్వేకోడూరు, జనవరి 3: రైల్వేకోడూరులో వైసీపీ బుధవారం నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్ర తుస్సుమంది. జనాలను బస్సుల్లో తరలించినా భోజనాలు అయిన తర్వాత సభ ప్రారంభం కాగానే సభా స్థలి నుంచి వెళ్లిపోయారు. స్థానిక ఎమ్మెల్యే కొరముట్ల, సినీనటుడు, వైసీపీ నాయకుడు అలీ ప్రసంగిస్తుండగానే కుర్చీలన్నీ ఖాళీ అయిపోయాయి. రైల్వేకోడూరు పట్టణంలోని కడప-తిరుపతి ప్రధాన రహదారిలోని వైఎస్ఆర్ సర్కిల్ వద్ద స్టేజి ఏర్పాటు చేయడంతో ఉదయం నుంచి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వాహనాల రాకపోకలను పూర్తిగా ఆపివేశారు. రైల్వేకోడూరు-కడప మార్గం, రైల్వేకోడూరు-తిరుపతి ప్రధాన మార్గంలో ఆర్టీసీ బస్సులు, లారీలను నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు అష్టకష్టాలు పడ్డారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాలకు వెళ్లే వారు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ముష్టేరు నదికి సమీపంలో ఉన్న ఓ ఫంక్షన్ హాలు వద్ద నుంచి వైఎస్ఆర్ సర్కిల్ వరకు బస్సు యాత్ర చేయడంతో పట్టణంలో ట్రాఫిక్ నిలిచిపోయింది. సభ ప్రాంగణం వద్ద వద్ద ఉన్న షాపులను మూయించారు. బస్సు యాత్ర పుణ్యమాని తోపుడు బండ్ల వ్యాపారులకు ఒక్కరోజు జీవన భృతి లేకుండా పోయింది. యాత్ర కోసం గ్రామాల నుంచి జనాలను తరలించేందుకు ప్రైవేటు స్కూళ్ల బస్సులను వాడుకున్నారు. అటవీశాఖ అతిథిగృహం వద్ద భోజనాలు తయారు చేసి వచ్చిన జనాలకు వడ్డించారు. దీంతో అక్కడ తోపులాట జరిగింది. మహిళలు పలు ఇక్కట్లు పడ్డారు. సభ జరిగిన ప్రధాన రహదారిలో దుకాణాలు కనిపించకుండా నాయకుల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో దుకాణాలు మూసుకోవాల్సి వచ్చింది. అంబులెన్స్ కూడా ఒక దశలో నిలిచిపోవాల్సి వచ్చింది. వెంటనే పోలీసులు జోక్యం చేసుకుని మండలంలోని సూరపురాజుపల్లె మీదుగా రైల్వేకోడూరు శివారు వరకు సుమారు 12 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సభ ప్రారంభం కాకమునుపే జనాలు మెల్లగా భోజనాలు చేసి వెళ్లిపోయారు. సామాజిక సాధికార బస్సు యాత్ర రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ సినీ నటుడు ఆలీ, బాపట్ల ఎంపీ నందిగామ సురేశ్, కడప మేయర్ సురేశ్‌బాబు, ఎమ్మెల్సీలు రామసుబ్బారెడ్డి, రమేశ్‌యాదవ్, టీటీడీ బోర్డు సభ్యుడు యానాదయ్య, స్థానిక నాయకులు హాజరయ్యారు. యాత్ర మధ్యలోనే జనాలు లేక కుర్చీలు ఖాళీ కావడంతో యాత్ర వెలవెలబోయింది. ఐదు మండలాల నుంచి చాలా మంది కార్యకర్తలు, నాయకులు తీవ్ర అసంతృప్తితో రాలేదని చాలా మంది బాహాటంగా చెప్పుకోవడం విశేషం.



మైసూరువారిపల్లె వద్ద నిలిచిపోయిన బస్సులు



దుకాణాలు కనిపించకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

వైసీపీ నేతల బెదిరింపులతో
వ్యక్తి ఆత్మహత్య



మృతదేహం - మృతుడు సురేంద్రబాబు (ఫైల్)

రాజంపేట, జనవరి 3 : మండలంలోని బోయినపల్లె సమీపంలోని ఇందిరమ్మ కాలనీలో ఓ స్థల విషయమై బెదిరించడంతో పెరమాల సురేంద్రబాబు అనే వ్యక్తి పురుగుల మందు తాగి బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బంధువులు మన్నూరు పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. ఇందిరమ్మ కాలనీలో ఓ స్థలం విషయమై వైసీపీ నేతల మధ్య చాలా రోజులుగా వివాదం చెలరేగుతోంది. మృతుడు నరేంద్రబాబు ఓ స్థలాన్ని స్వాధీనం చేసుకుని అక్కడ ఇల్లు కట్టుకున్నాడు. వైసీపీకి చెందిన రెడ్డెయ్య, పెంచలయ్య, రామకృష్ణలు నరేంద్రబాబును ఆ స్థలాన్ని ఖాళీ చేసి వెళ్లిపోమని బెదిరించడంతో విధి లేని పరిస్థితుల్లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని బంధువులు తెలిపారు. ఈ విషయమై ఎస్‌ఐ భక్తవత్సలంను వివరణ కోరగా బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, ఓ స్థలం విషయమై మృతుడికి మూడు రోజులుగా ఫోన్‌లో బెదిరింపులు వచ్చాయని తెలిసిందని, దీనిపై విచారణ చేస్తున్నామని తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

మంటల్లో చిక్కుకున్న వ్యక్తిని రక్షించిన ఫైర్ సిబ్బంది

కడప (క్రైం), జనవరి 3 : కడప నగరం మోచంపేటలో బుధవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మంటలు వ్యాపించి ఇంట్లోని వస్తువులు కాలిపోయాయి. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక అధికారి బస్విరెడ్డి ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. లోపల షేక్ జావేద్‌బాషా అనే యువకుడు ఇంట్లో చిక్కుకోవడంతో ఫైర్ సిబ్బంది అతడిని సురక్షితంగా బయటికి తీసుకువచ్చారు. పొగ అలుముకోవడంతో ఊపిరాడక స్పృహ తప్పిపోవడంతో ఆ యువకుడిని సీపీఆర్ చేయడంతో ఆ యువకుడు స్పృహలోకి వచ్చాడు. దీంతో వైద్యపరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఫైర్ సిబ్బంది మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. దాదాపు లక్ష రూపాయల మేర ఆస్తినష్టం జరిగినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

ఆరు ఎర్రచందనం దుంగలు స్వాధీనం



పట్టుబడ్డ నిందితుడు, దుంగలతో అటవీ శాఖాధికారులు

సుండుపల్లె, జనవరి 3: సానిపాయి రేంజ్ రాయవరం సెక్షన్ ముడుంపాడు బీట్ రిజర్వ్ ఫారెస్టులో మంగళవారం రాత్రి ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రమేశ్‌బాబు తెలిపారు. జిల్లా అటవీశాఖ అధికారి వివేక్, సానిపాయి రేంజ్ ఆఫీసర్ పీరయ్య ఆదేశాల మేరకు సానిపాయి రేంజ్ రాయవరం సెక్షన్ ముడుంపాడు బీట్ రిజర్వ్ ఫారెస్టులో మంగళవారం తనిఖీలు చేపట్టామన్నారు. అక్రమ రవాణా చేసేందుకు సిద్ధంగా ఉన్న ఆరు ఎర్రచందనం దుంగలు, ఒక కారుతో పాటు తమిళనాడు రాష్ట్రానికి చెందిన మునికందన్ అనే వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దుంగల విలువ రూ.45,314 ఉంటుందని తెలిపారు. నిందితుడిని రిమాండుకు తరలించినట్లు తెలిపారు. తనిఖీల్లో ఎఫ్‌బీవోలు అంజన, స్వాతి, లక్ష్మిప్రసన్న, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

టాటాఏస్‌ను ఢీకొన్న కారు

ఒకరి మృతి.. ముగ్గురికి గాయాలు



మృతదేహం వద్ద రోదిస్తున్న మృతుడి భార్య

పోరుమామిళ్ల, జనవరి 3 : మండలంలోని చెన్నారెడ్డిపేట సమీపంలో ఎదురుగా వస్తున్న టాటాఏస్‌ను కారు ఢీకొనడంతో నగిలి బాలరాజు (35) అనే వ్యక్తి మృతి చెందాడు. కాగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. విజయ్‌కుమార్ అనే వ్యక్తి కారులో దంతలపల్లెకు వెళుతుండగా పోరుమామిళ్ల చెందిన సుబ్బరాయుడుకు చెందిన సప్లయర్స్‌లో పనిచేస్తున్న బాలరాజు, మరో ముగ్గురు వ్యక్తులు బి.కోడూరు నుంచి పోరుమామిళ్లకు సప్లయర్స్‌ను తీసుకువస్తుండగా విజయకుమార్ అతివేగంగా కారు నడిపి టాటాఏస్‌ను ఢీకొనడంతో టాటాఏస్‌లోని బాలరాజు (35) మృతి చెందాడు. మరో ముగ్గురికి గాయాలు కావడంతో వారిని పోరుమామిళ్లలో ప్రధమ చికిత్స అనంతరం కడపకు తరలించారు. ఈ మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వెంకటయ్య పేరిట 'సావేరా' నాటక అవార్డు

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 3 : సావేరా.. నాటక సంస్థను స్థాపించి నంది అవార్డుల పంట పండించి నాటక కళద్వారా జిల్లాకు గొప్ప ప్రతిష్ట తెచ్చిన అళ్లూరి వెంకటయ్య పేరిట నాటక అవార్డు ఏర్పాటు చేస్తున్నామని సంస్థ గౌరవ అధ్యక్షుడు, ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ మానస కె.చిన్నపరెడ్డి తెలిపారు. బుధవారం సీనియర్ ఆడిటర్ లయన్ ఖాసింఖాన్ కార్యాలయంలో నంది అవార్డు విజేతలైన ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, పల్లేటి లక్ష్మికులశేఖర్‌లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చిన్నపరెడ్డి మాట్లాడుతూ ఇంటాక్ వారసత్వ కళల రక్షణలో భాగంగా జిల్లాకు గర్వకారణంగా నిలిచిన సావేరా సంస్థ నిర్వహణ బాధ్యత తాము తీసుకున్నామని అన్నారు. ఆ సంస్థకు ఊపిరిలాంటి ఆళ్లూరి వెంకటయ్య పేరిట లయన్ పోతుల వెంకట్రామిరెడ్డితో కలిసి నూతన వైభవం సంతరించిపెట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఖాసింఖాన్ మాట్లాడుతూ నాటకరంగంలో జిల్లా ప్రతిష్టను పెంచి సావేరా సంస్థకు కొత్త ఉత్సాహం కల్పించేందుకు కొత్త కమిటీ ఏర్పాటుతో పాటు రూ.1,16,116 కార్పస్ ఫండ్‌తో సంస్థను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ కార్యదర్శి కొండూరు జనార్ధనరాజు, సంస్థ ప్రతినిధులు వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, గొబ్బూరి కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త రోడ్డును తవ్వేశారు

● ప్రజాధనమంటే లెక్కలేని అధికారులు ● సుందరీకరణ కనిపించాలంటే మళ్లీ పనులు చేపట్టాల్సిందే..



డిసెంబరు 22వ తేదీ బోలేవార్డులో ఉన్న రోడ్డు



డిసెంబరు 23వ తేదీ బోలేవార్డులో నిర్మించిన కొత్త రోడ్డు

పులివెందుల రూరల్, జనవరి 3: పులివెందుల పట్టణంలో కొత్తగా నిర్మించిన రోడ్డును తవ్వేశారు. గత నెల 25న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందులకు రానున్న సందర్భంగా బోలేవార్డులో కొత్త తారురోడ్డు నిర్మించారు. మోడల్ టౌన్‌లో భాగంగా బోలేవార్డు పేరుతో పడగొట్టిన బస్టాండ్ నుంచి సత్రం పాఠశాల వరకు సుందరీకరణ పనులు జరుగుతున్నాయి. డిసెంబరు నాటికి పూర్తికావాల్సి ఉన్న పనులు పలు కారణాలతో ఆలస్యమయ్యాయి. అయితే బోలేవార్డు పనులను ముఖ్యమంత్రికి చూపించాలని అధికారులు తలచారు. డిసెంబరు 22వ తేదీ రాత్రి వరకు లేని రోడ్డు 23వ తేదీ ఉదయానికి నూతనంగా తారురోడ్డు నిర్మించారు. యూజీడీ మ్యాన్‌హోల్స్ ఉన్నప్పటికీ వాటిపైనే కొత్త రోడ్డును నిర్మించారు. ఇపుడు యూజీడీ మ్యాన్‌హోల్స్ పూడకుండా ఎత్తు పెంచాలని మున్సిపల్ అధికారులు కాంట్రాక్టర్‌కు సూచించారు. దీంతో ఆ మ్యాన్‌హోల్స్ ఎత్తు పెంచి రోడ్డుపైకి కనిపించేలా ఏర్పాటు చేసేందుకు రోడ్డును తవ్వేశారు. లక్షల రూపాయలు వెచ్చించి రోడ్డు నిర్మాణం చేపట్టాలనుకున్నప్పుడు పనులు ఎలా చేయాలో ముందస్తు ప్రణాళిక ఉంటుంది. అలాంటిది రూ.3కోట్లకు పైగా వెచ్చించి బోలేవార్డు సుందరీకరణ పనులు చేస్తున్నారు. ప్రస్తుతం రోడ్డు తవ్వడంతో సుందరీకరణ ఎలా కనిపిస్తుందని పలువురు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రజాధనమంటే లెక్క లేకుండా పోతోందంటూ సంబంధిత అధికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



డిసెంబరు 31వ తేదీ బోలేవార్డులో రోడ్డు దుస్థితి

దివాళా తీసిన బైజూస్‌తో విద్యా వ్యాపారమా?

● తక్షణమే ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలి ● ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన



బైజూస్ కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న దృశ్యం

కడప (ఎడ్యుకేషన్), జనవరి 3 : పేద, మధ్య తరగతి విద్యార్థుల జీవితాలను అస్తవ్యస్తం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం బైజూస్‌తో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు దస్తగిరి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వలరాజు డిమాండ్ చేశారు. బైజూస్‌తో ఒప్పందానికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న నిరసనలో భాగంగా బుధవారం కడప నగరం బైజూస్ ఆకాశ్ కోచింగ్ సెంటర్ ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.3500 కోట్ల ప్రజాధనాన్ని బైజూస్‌కు అప్పజెప్పడానికి రాష్ట్ర ప్రభుత్వం ట్యాబ్‌ల పేరుతో ఒప్పందం చేసుకుందన్నారు. దీని ద్వారా సబ్జెక్టు అర్థం కాని వారికి రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు బైజూస్ ట్యూషన్ పాయింట్‌ను బైజూస్ సంస్థ ఏర్పాటు చేసిందని తెలిపారు. ఇందులో చేరే ప్రతి విద్యార్థి నుంచి రూ.15 వేలు కట్టించుకుని అడ్మిషన్లు చేసుకుంటున్నారని ఆరోపించారు. ఎవరైనా ఒక నెల తరువాత తరగతులు వద్దనుకుంటే వారి ఫీజు మొత్తం వాపసు చేస్తామని బైజూస్ ప్రతినిధులు తల్లిదండ్రులకు చెబుతున్నారన్నారు. ఎవరైనా తల్లిదండ్రులు ఒకేసారి రూ.60 వేలు ఫీజు చెల్లించలేనప్పుడు బజాజ్ ఫైనాన్స్ ద్వారా ఈఎంఐ రూపంలో ప్రతినెలా రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు సౌకర్యం కల్పిస్తున్నామని చెబుతున్నారన్నారు. దివాళా తీసిన బైజూ్‌ఎను గట్టెక్కించడానికి రాష్ట్ర ప్రభుత్వం కొత్త పుంతలు తొక్కిస్తోందన్నారు. ట్యాబ్‌ల పేరుతో కోట్లాది రూపాయలు ప్రజాధనాన్ని దోచిపెడుతున్నారని తెలిపారు. ఆ సంస్థను రాష్ట్రంలో నిషేధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు రాహుల్, నాగేంద్ర, ఏఐఎస్ఎఫ్ నాయకులు అరుణ్, శివ పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ : డ్రైవర్ మృతి



క్యాబిన్‌లో చిక్కుకుని మృతి చెందిన లారీ డ్రైవర్

వెంకటగిరి, జనవరి 3: ప్రమాదం జరిగి ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొంది. ఈ ఘటనలో ఓ డ్రైవర్ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి జిల్లా పొదలకూరు నుంచి పిడకల లోడుతో ఓ లారీ తిరుపతికి బయలుదేరింది.

వెంకటగిరి పట్టణం కాంపాళెం సమీపంలోని రాపూరు రోడ్డు మలుపు వద్ద తన లారీని ఓవర్ టేక్ చేసి వెళుతున్న కారును తప్పించబోయి ఎదురుగా ఉన్న కైవల్య నది వంతెన గోడను ఢీకొంది. దీంతో లారీ ముందు టైర్లు పగిలిపోయి అక్కడే ఆగిపోయింది. బుధవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. అదే సమయంలో నంద్యాల నుంచి చెన్నైకి ఉల్లిపాయలతో వెళుతున్న లారీ తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో ఆగి ఉన్న లారీని వెనుక వైపునుంచి అదుపుతప్పి ఢీకొంది. ఈ ఘటనలో లారీ క్యాబిన్‌లో చిక్కుకుని డ్రైవర్ హరి (45) మృతి చెందాడు. మృతుడిది కడప జిల్లా మైదుకూరు అరుంధతీవాడగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైవీయూ అడ్మిషన్స్ డైరెక్టర్‌గా లక్ష్మీప్రసాద్



నియామకపత్రం అందుకుంటున్న లక్ష్మీప్రసాద్

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 3 : వైవీయూ ప్రవేశాల సంచాలకులుగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎర్త్ సైన్స్ అసోసియేట్ ప్రొఫెసరు డాక్టర్ లక్ష్మీప్రసాద్ నియమితులయ్యారు. వైస్ చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వైపీ వెంకటసుబ్బయ్య నియామకపత్రాన్ని లక్ష్మీప్రసాద్‌కు అందించారు. ఇదివరకు ఈ స్థానంలో పనిచేసిన ప్రొఫెసరు కంకణాల గంగయ్య పదవీకాలం పూర్తి కావడంతో ఈ నియామకం చేసినట్లు చెప్పారు. అసోసియేట్ డైరెక్టర్లుగా డాక్టర్ పి.వసు గోవర్ధనరెడ్డి, డాక్టర్ ఎ.మునికుమారి, డాక్టర్ రెడ్డయ్య, డాక్టర్ ఎస్.గణేశ్ నాయక్‌లను నియమించారు. వీరి స్థానాల్లో ఇది వరకు ఉన్న వారు బాధ్యతల నుంచి తప్పుకున్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

అంగన్వాడీల కలెక్టరేట్ ముట్టడి భగ్నం

- వామపక్షాలతో కలెక్టరేట్‌లోకి వెళ్లే ప్రయత్నం
- అడ్డుకున్న పోలీసులు
- కలెక్టర్ గేటు వద్ద కొద్దిసేపు ఉద్రిక్తత



కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి భారీగా వచ్చిన అంగన్వాడీలు



అంగన్‌వాడీకార్యకర్తల ధర్నాకు మద్దతు తెలుపుతున్న జనసేన, సీపీఐ, సీఐటీయూ నాయకులు

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 3: రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు 23వ రోజు కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా రాయచోటిలో బుధవారం అంగన్వాడీలు చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేశారు. కలెక్టర్ కార్యాలయంలోకి వెళ్లేం దుకు అంగన్వాడీలు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరువురు మధ్య తోపులాట జరిగింది. అనంతరం అంగన్వాడీలు గేటుకు ఎదురుగా కూర్చుని పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జాతీయ రహదారికి అడ్డంగా కూర్చుని వాహనాల రాకపోకలను నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీల సంఘం అధ్యక్షురాలు శ్రీలత మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు ఒకలా.. అధికారం వచ్చాక మాట మార్చుతున్న ఈ ముఖ్యమంత్రిని గద్దెదించే వరు ఈ పోరాటం ఆగదని వారు హెచ్చరించారు. అనంతరం సీపీయం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలకు న్యాయం చేసే వరకు ఈ పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. కాగా, అంగన్వాడీల సమ్మెకు బుధవారం మధ్యాహ్నం జిల్లా పరిషత్ మాజీ ఛైర్‌పర్సన్ సుగవాసి బాలసుబ్రమణ్యం మద్దతు పలికారు. అనంతరం మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మీ సమస్యలన్నీ పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సీపీఐ, సీపీయం, సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా నాయకులు, పెద్ద ఎత్తున అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజంపేట-రాయచోటిరోడ్డుపై రాస్తారోకో

రాజంపేట, జనవరి3 : తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని రాయచోటి కలెక్టరేట్ ముట్టడికి వెళుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలను పోలీసులు అడ్డుకోవడంతో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. రాయచోటి-రాజంపేట రహదారిలో రంగరాజుపాలెం వద్ద వెళుతున్న అంగన్‌వాడీల బస్సును పోలీసులుఆపివేయడంతో రోడ్డుపై బైఠాయించి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో సుమారు 4గంటలపాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ ధర్నా కార్యక్రమానికి రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గం నుంచి భారీగా అంగన్‌వాడీలు, ఆయాలు తరలివచ్చారు. జనసేన నాయకులు అతికారి దినేష్, సీఐటీయూ, సీపీఐ నేతలు మద్దతు తెలిపారు.

సమస్యలు పరిష్కరించేంతవరకు సమ్మె కొనసాగిస్తాం



మున్సిపల్ కార్యాలయం ఎదుట
చేతికి బేడీలు వేసుకుని నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

రాయచోటిటౌన్, జనవరి 3: ప్రభుత్వం మున్సిపల్ వర్కర్స్ సమస్యలను పరిష్కరించేంతవరకు సమ్మె కొనసాగిస్తామని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్నయ్య, రాంబాబులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం 9వ రోజు సమ్మెలో భాగంగా మున్సిపల్ కార్మికులు చేతికి బేడీలు వేసుకుని మున్సిపల్ కార్యాలయం ఎదుట ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన నాలుగున్నర సంవత్సరాలుగా మున్సిపల్ ఉద్యోగ కార్మికులు తమ సమస్యల పరిష్కరించాలని ప్రభుత్వ పెద్దలకు అభ్యర్థించినా పరిష్కారం కాకపోవడంతో విసిగిపోయి సమ్మెబాట పట్టాల్సి వచ్చిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా పాదయాత్ర చేసిన సందర్భంగా ఒక సంవత్సరం ఓపిక పట్టండి మనందరి ప్రభుత్వం వచ్చిన వెంటనే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తామని చెప్పిన మాటను గాలికి వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కార్మికశాఖ ప్రతిపాదనల మేరకు జీవో ఆర్‌టీ నెంబరు 30 ప్రకారం పంపు ఆపరేటర్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వర్కర్స్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, బిల్ కలెక్టర్లు, స్ట్రీట్ లైటింగ్, టౌన్‌ప్లానింగ్, ఆఫీసు నిర్వహణ కార్మికులకు వేతనాలు పెంచుతామని మూడేళ్లుగా హామీలతోనే సరిపెడుతున్నారని విమర్శించారు. కార్మికనాయకులు సిద్దయ్య, పెద్దమంగమ్మ, తిరుపతమ్మ, ఆంజనేయులు, రవికుమార్, వెంకటరమణ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ట్యాక్సులు వసూలు చేయండి

రామాపురం, జనవరి 3: 13 గ్రామ పంచాయతీ పరిధిలోని దుకాణాలు, పక్కా గృహాలకు సంబంధించిన టాక్స్‌లు ఈనెల 31లోపు 50 శాతం వరకు పూర్తి చేయాలని డీఎల్‌పీవో పార్వతమ్మ ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో సభాభవనంలో బుధవారం పంచాయతీ, సచివాలయ కార్యదర్శుల సమావేశంలో ఆమె మాట్లా డుతూ సచివాలయ కార్యదర్శులు ప్రతి ఇంటికి వెళ్లి దుకాణాల వద్ద ప్రజలకు అవగాహన కల్పించి ట్యాక్స్ వసూలు చేయాలన్నారు. ఈవోపీఆర్‌డీ ఉషారాణి, ఎంపీ డీవో హైదర్‌వలి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ వితరణ

సుండుపల్లె, జనవరి 3: తిమ్మసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.18వేలు విలువ చేసే ప్రింటర్‌ను పాఠశాల ఛైర్మన్, దాత ఫరూక్ వితరణ చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్‌నాయక్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఎంతో ఉపయోగపడే ప్రింటర్‌ను అందజేయడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు హకీమ్, ఉపాధ్యాయులు మణి కంఠ, సబిహా తదితరులు పాల్గొన్నారు.

8న రాజంపేటలో జాబ్‌మేళా

రాజంపేట, జనవరి3 : రాజంపేటలో ఈ నెల 8వ తేదీ సోమవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలి పారు. అన్నమయ్య, వైఎస్సార్ జిల్లా యువతకు ఈ జాబ్ మేళా ఉంటుందని.. జాబ్‌మేళాకు ప్రముఖ కంపెనీలు కడపకు చెందిన షిరిడీసాయి ఎలక్ట్రికల్స్, వెంకటసాయి ఏజన్సీస్, దుర్గా ఆటోమోటివ్ తదితర ఆటోమొబైల్స్ సంస్థలు పాల్గొని వారికి అవసరమైన అభ్యర్థులను ఉద్యోగాల్లో చేర్చుకుంటారన్నారు. ఐటీఐ, పది పాసై సర్టిఫికెట్లు పొందిన వారు ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు, బ్యాంకుపాసుబుక్కు జిరాక్స్ కాపీలతో ఈ జాబ్‌మేళాకు హాజరు కావాలని తెలిపారు.

బీఎల్‌వో సస్పెన్షన్

చిట్వేలి, జనవరి 3: మండల పరిధిలోని నాగవరం పంచాయతీలో బీఎల్‌వోగా విధులు నిర్వహిస్తున్న చిట్టి పి.రెడ్డి గంగాధర్‌ను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు తహశీల్దారు శిరీష బుధవారం తెలిపారు. గంగాధర్ నాగవరం సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ.. నాగవరం వడ్డిపల్లె బీఎల్‌వోగా విధులు నిర్వహిస్తున్నారు. విధుల సమయంలో హాజరు కాకపోవడం, నిర్లక్ష్యధోరణిలో వ్యవహరించడంపై రాజంపేట పార్లమెంటు టీడీపీ వాణిజ్య విభాగం సెక్రటరీ బుంగటావుల రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతనిపై వచ్చిన పలు ఆరోపణలు, జిల్లా ఉన్నతాధికారులు, సమావేశాలకు హాజరుకాకపోవడం వంటి వాటిపై సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వులు అందాయని ఆమె తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు

సుండుపల్లె, జనవరి3: చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు రెడ్డెప్ప, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి రామ్మోహన్ తెలిపారు. బుధవారం సుండుపల్లె లోని కృష్ణానగర్, జనార్ధన్‌రెడ్డి నగర్‌లలో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాలకు లబ్ధి చేకూరుతుందన్నారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు సుబ్బరామయ్య, మహిళా మండలాధ్యక్షురాలు రెడ్డిరాణి, టీడీపీ నాయకులు సురేశ్ నాయుడు, ఎల్వీరమణ పాల్గొన్నారు.

నవరత్నాల పేరుతో దుర్మార్గపు పాలన

రాజంపేట, జనవరి 3: నవరత్నాల పేరిట అధికారం చేపట్టి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి దుర్మార్గపు పాలనతో అరచకాలు చేసిన జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం కుప్పకూలుతుందని, వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని ఆ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్య నాయుడు పేర్కొన్నారు.

రాజంపేట మండలం బ్రాహ్మణపల్లెలో బుధవారం నిర్వహించిన బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు దేశంపార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, చంద్రబాబునాయుడు నాల్గవసారి ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. ఈసందర్భంగా బాబుష్యూరిటీ, భవిష్య త్తుకు గ్యారెంటీ కరపత్రాలను గ్రామంలో పంపిణీ చేశారు. టీడీపీ స్థానిక నాయకులు జయన్న, నరసింహులు, రవీంద్ర, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి



బోరెడ్డిగారిపల్లెలో పర్యటిస్తున్న సుబ్రమణ్యం, రమేశ్‌రెడ్డి

గాలివీడు, జనవరి 3: తెలుగుదేం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు అధికా రంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని మాజీ ఎమ్మెల్యే, రాయచోటి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రమేశ్‌కుమార్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నేత సుగవాసి బాలసుబ్రమణ్యంలు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బోరెడ్డిగారిపల్లె గ్రామంలో వారు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడు జరిగినా తెలుగుదేశం పార్టీ విజయం సాధిస్తుందన్నారు. రాష్ట్రం అభివృద్ధిలో చాలా వెనుకబడి ఉందని.. దీనికి వైసీపీ ప్రభుత్వం అవలంబించే విధానాలే కారణమని దుయ్యబట్టారు. తెలుగుదేశం పార్టీ హయాంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల అభివృద్ధి, సంక్షేమం కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి అమలు చేశామని తెలిపారు. రాజంపేట పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు మందపాటి రవీంద్రబాబు, మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు లక్ష్మ య్య, మాజీ వైస్ ఎంపీపీ మోపూరి రమణయ్య, మాజీ సర్పంచులు ప్రభా కర్‌నాయుడు, చిన్నపరెడ్డి, దేరంగుల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్షా 35 వేలు ఆర్థిక సాయం



గోపాల్ కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న ఫారెస్టు అధికారులు

రామాపురం, జనవరి3: రాయచోటి రేంజ్ గువ్వలచెరువు బీట్‌లో ప్రొటెక్షన్ వాచర్‌గా పనిచేస్తున్న బి.గోపాల్ (38) ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం తెలిసిందే. బుధవారం మండలంలోని సుద్దమళ్ల పంచాయతీ ఎగువ దళితవాడలోని గోపాల్ కుటుంబానికి ఫారెస్ట్, సబ్ డివిజనల్ అధికారి శ్రీనివాసులు రూ.1,35,000 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో రాయచోటి ఫారెస్ట్ రేంజర్ రాయచోటి రఘుశంకర్, రేంజ్ ఆఫీసర్, నగరవనం, రాయచోటి రమేశ్, డీఆర్‌వో, రాయచోటి సెక్షన్ భరణికుమార్, ఇన్‌చార్జి సెక్షన్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ కళాశాలల సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటం

- ప్రైవేటు డిగ్రీ కళాశాలల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

రాయచోటిటౌన్, జనవరి 3: ప్రైవేటు జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తున్నామని డిగ్రీ కళాశాలల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కనుమల గుండారెడ్డి అన్నారు. బుధవారం ఆయన రాయచోటి పట్టణ పరిధిలోని ఎగువ అబ్బవరం సమీపంలో గల అర్చనా విద్యాసంస్థల్లో జరిగిన ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సమావేశం సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 2020-21 సంవత్సరానికి సంబంధించి ఫీజు రియం బర్స్‌మెంట్ పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే పీజీ కోర్సులు చదివే వారికి విదేశీ విద్యాదీవెన ఇవ్వమని ప్రభుత్వం చెప్పినప్పటికీ.. తప్పనిసరిగా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఫీజు చెల్లించాలని కోరామన్నారు. ప్రైవేటు కళాశాలలకు రావాల్సిన పెండింగ్ బకాయిలు చెల్లించాలని, మదర్ అకౌంట్లను రద్దు చేయాలని కూడా కేసు వేశామన్నారు. ప్రైవేటు జూనియర్ కళాశాల అసోషియేషన్ రాష్ట్ర అసోషియేట్ ప్రెసిడెంట్ డాక్టర్ పి.మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రైవేటు డిగ్రీ జూనియర్ కళాశాల సమస్య పరిష్కారం కోసం మొదటి నుంచి అసోషియేషన్ ఎక్కడ రాజీ పడకుండా పోరాటాలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో కొన్ని ప్రైవేటు డిగ్రీ కళాశాలలకు సుమారు రూ.159 కోట్లకు పైగా ఫీజు రియం బర్స్‌మెంట్ బకాయిలు రావాల్సి ఉండగా.. ప్రభుత్వం వెంటనే చెల్లించాలని కోర్టులో కేసు కూడా వేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఫీజు రియంబర్స్‌మెంట్ రూ.450 కోట్లు పెండింగ్‌లో ఉందని వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బకాయిలు చెల్లించకుంటే మూల్యం చెల్లించక తప్పదు



ధర్నాలో మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

రాయచోటి(కలెక్టరేట్), జన వరి 3: రాయచోటి కలెక్టరేట్ వద్ద యూటీఎఫ్ రాష్ట్రశాఖ పిలుపు మేరకు బుధవారం 12 గంటల ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా జిల్లా యూటీఎఫ్ అధ్యక్షుడు హరిప్రసాద్ మాట్లాడుతూ డీఏ అరియర్స్, పీఆర్‌సీ అరియర్లు, పీఎఫ్ లోన్లు, ఏపీజీఎల్ఐ అమౌంట్ అన్నీ కలిసి దాదాపు 19 వేల కోట్ల రూపాయలు ప్రభుత్వం బాకీ ఉందని, తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్ మాట్లాడుతూ ప్రతి నెల 1వ తేదీ జీతాలు చెల్లించాలని, 12వ పీఆర్‌సీని వెంటనే అమలు పరచాలని, అంతవరకు 30 శాతం ఐఆర్‌ను ఇవ్వాలని, మునుపటి పీఆర్‌సీ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అన్నమయ్య జిల్లా గౌరవాధ్యక్షుడు సుధాకర్‌నాయుడు మాట్లాడుతూ సీపీఎస్, జీపీఎస్ అనేటు వంటివి చాలా దుర్మార్గమైనవని అన్నారు. మహిళా అధ్యక్షురాలు హేమలత మాట్లా_డుతూ ముఖ్యమంత్రి అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సీపీఎస్‌ను రద్దు చేస్తానని చెప్పి ఈ రోజు మాట తప్పి మడమ తిప్పాడని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ చెంగల్‌రాజు, జిల్లా కార్యదర్శులు పురుం వెంకట్రమణ, వెంకట సుబ్బయ్య, రమణమూర్తి, దాముద్దీన్, అక్రంబాష, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సురేంద్రరెడ్డి, ఆడిట్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి సావిత్రిభాయి పూలే



సావిత్రిభాయి పూలే చిత్రపటానికి
నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

సుండుపల్లె, జనవరి3: స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి సావిత్రిభాయి పూలే అని మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్‌నాయక్ తెలిపారు. బుధవారం తిమ్మసముద్రం జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో సావిత్రి భాయిపూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సావిత్రిభాయి పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రధానోపాధ్యాయులు, ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.

మహిళా హక్కుల కోసం..

లక్కిరెడ్డిపల్లె, జనవరి 3: మహిళా హక్కుల కోసం తమ జీవితాన్నే త్యాగం చేసిన ఆదర్శమూర్తి సావిత్రిభాయిపూలే నని ముదిరాజ్ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షరాలు లక్ష్మిరాజ్యం పేర్కొన్నారు. సాయిత్రిబాయిపూలే 193 జయంతి సందర్భంగా ఆమే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ లర్పించారు. మహిళా సంఘం సభ్యులు లక్ష్మి దేవి, అరుణమ్మ, రెడ్డిచైతన్య తదితరులు పాల్గొన్నారు.

జనసేన రాష్ట్ర కార్యదర్శి అక్రమ అరెస్టు

రైల్వేకోడూరు, జనవరి 3: రైల్వేకోడూరులో బుధవారం వైసీపీ సామాజిక సాధికార బస్సుయాత్ర ఉండటంతో జనసేన రాష్ట్ర కారదర్శి తాతంశెట్టి నాగేంద్రను రైల్వేకోడూరు పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి రాజంపేట మన్నూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే పోలీసులు అక్రమంగా అరెస్టులు చేస్తున్నారని ఇది న్యాయం కాదన్నారు. ప్రజల కోసం ఏమి చేయని వైసీపీ ప్రభుత్వం వచ్చే ఎన్నికల్లో చావు దెబ్బతింటుందన్నారు. ప్రజలకు మేలు చేసి ఉంటే తప్పకుండా యాత్ర చేయాల్సిందే అని తెలిపారు. ప్రజలకు ఏమి చేయనప్పుడు ఎందుకు యాత్రలు చేస్తున్నారని ప్రశ్నించారు.

న్యాయవ్యవస్థ గౌరవాన్ని పెంచే బాధ్యత న్యాయవాదులదే

- రాయచోటి 5వ అదనపు జడ్జి కృష్ణన్‌కుట్టి సందేశం



రాయచోటి కోర్టు హాల్‌లో ఐఏఎల్ డైరీలను ఆవిష్కరిస్తున్న జడ్జి కృష్ణన్‌కుట్టి

రాయచోటిటౌన్, జనవరి 3: భారతదేశ ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన న్యాయవ్యవస్థ గౌరవాన్ని పెంచి... కాపాడుకోవాల్సిన బాధ్యత న్యాయవాదుల భుజస్కందాలపై ఉంటుందని రాయచోటి ఐదవ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్‌కుట్టి అన్నారు. భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) క్యాలెండర్, డైరీలను బుధవారం రాయచోటి 5వ అదనపు జిల్లా జడ్జి కోర్టు హాల్‌లో ఆయన ఆవిష్కరించారు. అఖిల భారత న్యాయ వా దుల సంఘం కడప, అన్నమయ్య జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్, జాయింట్ సెక్రటరీ ఖాదర్‌బాషా నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో జడ్జి కృష్ణన్‌కుట్టి మాట్లాడుతూ న్యాయవాదులు అందరూ న్యాయ వ్యవస్థలో భాగమని, ప్రజల హక్కులను కాపాడడంలో ముందుంటారన్నారు. అన్ని క్లిష్ట సమయాల్లో న్యాయవాదుల పాత్ర దేశంలో మరిచి పోలేనిదని.. వారిని స్ఫూర్తిగా తీసుకొని ప్రస్తుత న్యాయవాదులు కూడా న్యాయవ్యవస్థ ఔన్నత్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐఏఎల్ న్యాయవాదులు షరీఫ్, రాజకుమార్ రాజు, ధనుంజయ్‌కుమార్, చిన్నయ్య, ఆనంద్ కుమార్, అజంతుల్లా, పి.రెడ్డెయ్య, టీవీ రమణ, రాజ్‌కుమార్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

15వ రోజుకు చేరిన సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 3: సమగ్రశిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం నాటికి 15వ రోజుకు చేరింది. రాజంపేట టీడీపీ సీనియర్ నేత సుగవాసి బాలసుబ్రమణ్యం సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రస్తుత ముఖ్యమంత్రి పాదయాత్రలో సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారు. నాలుగున్నర సంవత్సరాలు గడిచినా ఇంతవరకు ఉద్యోగులకు న్యాయం చేయకపోవడం అన్యాయమన్నారు. సమగ్రశిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయడమే కాకుండా సమాన పనికి సమాన వేతనం అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున సమగ్ర శిక్ష ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాలు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి : ఎస్పీ



క్రికెట్ టోర్నీ ప్రారంభం సందర్భంగా టాస్ వేస్తున్న ఎస్పీ కృష్ణారావు

వీరబల్లి, జనవరి 3: యువకులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక జూనియర్ కళాశాలలో మాజీ జడ్పీటీసీ రామక్రిష్ణారెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు గాలివీటి వీరనాగిరెడ్డి, వివేకానందరెడ్డిలు ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. జూనియర్ కళాశాలకు ఆట స్థలం లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో వివేకానందరెడ్డి చొరవ తీసుకొని కళాశాలకు దాదాపు రూ.8 లక్షలు ఖర్చు చేసి ఆట స్థలాన్ని ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. టోర్నమెంట్‌లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.50వేలు, ద్వితీయ బహుమతి రూ.30వేలు అందజేస్తామని వివేకానందరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ వైసీపీ నాయకులు గాలివీటి ధర్మారెడ్డి, జెడ్పీటీసీ శివరాం, బరోడా బ్యాంక్ రీజనల్ మేనేజర్ అమర్‌నాథరెడ్డి, డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు కోల్పోయిన పిల్లలకు ఫిక్సిడ్ డిపాజిట్



పిల్లలకు డిపాజిట్ పత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

ఒంటిమిట్ట, జనవరి3 : మండల పరిధిలోని పెన్నపేరూరు గ్రామంలో తల్లిదం డ్రులను కోల్పోయిన ఇరువురు ఆడపిల్లలకు రాజంపేట టీడీపీ నాయకులు గంటా నరహరి ఇద్దరు పిల్లలకు లక్ష రూపాయలు చొప్పున స్థానిక ఎస్‌బీఐలో ఫిక్స్ డిపాజిట్ చేపట్టారు. ఫిక్సిడ్ చేసిన బ్యాంకు పత్రాలను నరహరి ప్రతినిధుల తరపున మండల ప్రధాన కార్యదర్శి బొబ్బిలిరాయుడు పలువురు టీడీపీ నాయకులతో కలిసి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం ద్వారాకుటుంబానికి చేయూతనిచ్చిన వారిగా అవుతామని గంటా నరహరి ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా దృక్పదంతో చేపట్టిన కార్యక్రమంగా వారు తెలిపారు. టీడీపీ నాయకులు లక్ష్మీనరసయ్య, రవిశంకర్ పాల్గొన్నారు.

అనారోగ్య బాధితురాలికి రూ.50వేలు ఆర్థికసహాయం

చిట్వేలి, జనవరి3 : చిట్వేలి బ్రాహ్మణవీధికి చెందిన ఆవుల జయమ్మ తీవ్ర అనారోగ్య సమస్యతో బాధపడుతుంది. జయమ్మకు కడుపులో ఇన్‌ఫెక్షన్ కారణంగా ఒళ్లంతా విపరీతంగా బొబ్బలు వచ్చాయి. కుటుంబ సభ్యులు ఆమెను ఏలూరు సీఎంసీలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. వైద్య ఖర్చులకు ఐదు లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు కుటుంబ సభ్యులకు తెలిపారు. ఈ నేపథ్యంలో విషయం తెలుసుకున్న ముక్కా రూపానంద రెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రూపానందరెడ్డి, కుమారుడు ముక్కాసాయి వికాస్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు రూ.50వేల చెక్కును అందించారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పుల్లంపేట, జనవరి 3: కేంద్ర ప్రభుత్వం పేదప్రజల కోసం సబ్సిడీతో అందించే పథకాలన్నింటినీ సద్వినియోగం చేసుకోవాలని ఈవోఆర్‌డీ ప్రకాశం తెలిపారు. బుధవారం మండల పరిధిలోని జాగువారిపల్లె, తిప్పాయపల్లె గ్రామాల్లో వీక్షిత్ భారత్ సంకల్పయత్ర భాగంగా మండలస్థాయి అధికారులందరూ ప్రజలకు కేంద్ర ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీల గురించి తెలియజేశారు. 2047 నాటికి భారతదేశం అగ్రగామిగా అభివృద్ధి చెందుతుందని ఈ సమావేశంలో ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ గ్యాస్‌స్టౌవ్‌లను గ్రామస్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ విజయ్‌కుమార్, ఏపీఎం సుబ్బయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మణెమ్మ, నిర్మల, బీజేపీ నాయకులు గాదెల శ్రీనివాసులు, కంబాల శ్రీనివాసులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

రైల్వేకోడూరు, జనవరి 3: మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయితీ పరిధిలోని పిల్లగుట్టకాలనీకి చెందిన చింతలపల్లె భాను (24) గత నెల 31న కుటుంబ సమస్యలతో విషద్రావణం తాగింది. దీంతో తిరుపతిలోని ఒక ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. అలాగే మండలంలోని తూర్పుపల్లె గ్రామానికి చెందిన నిమ్మ ఈశ్వరమ్మ (26) అనే మహిళ కడుపు నొప్పి తాళలేక ఈ నెల 1వ తేదీ విషదావ్రణం తాగింది. ఈమె చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఇరువురు మృతిపై పోలీసులు సమగ్రంగా విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

ఆస్తికోసం దాడి చేస్తున్నారు

● నడిరోడ్డుపై న్యాయంకోసం ఓ మహిళ నిరసన



నడిరోడ్డుపై బైఠాయించిన చంద్రమ్మ - గ్రామపెద్దల దౌర్జన్యం గురించి వివరిస్తున్న చంద్రమ్మ

కుప్పం, జనవరి 3: ఆస్తికోసం గ్రామపెద్దలు కొందరు, తన సోదరుడితో కలిసి తనమీద దాడికి పాల్పడుతున్నారని ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. కుప్పం పట్టణంలో నడిరోడ్డుపై బైఠాయించి ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత మహిళ కథనం మేరకు.. కుప్పం మండలం పైపాళ్యంలో నివసిస్తున్న చంద్రమ్మకు భర్త, రెండవ కొడుకు చనిపోయారు. పెద్ద కొడుకు ఉపాధికోసం వలస వెళ్లాడు. దీంతో ఒంటరిదైన చంద్రమ్మ నుంచి ఆమె ఆస్తిపాస్తులు లాక్కోవడానికి సోదరుడు మునినిరత్నంతోపాటు కొందరు గ్రామపెద్దలు కలిసి దాడిచేసి బాధిస్తున్నారు. ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆమె బుధవారం నేతాజీరోడ్డులోని గాంధీజీ విగ్రహం వద్ద బైఠాయించి ధర్నాకు దిగారు. తనకు న్యాయం జరిగేదాకా లేచేదిలేదని భీష్మించింది. దీని వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దీంతో పోలీసులు రంగంలోకి దిగి, ఆమెను బలవంతంగా లేపి, స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఫిర్యాదు చేస్తే న్యాయం జరుగుతుందని చెప్పడంతో ఆమె కూడా వారితో కలిసి స్టేషన్‌కు వెళ్లారు.

రూ.80.90 కోట్ల పెన్షన్ పంపిణీ



లబ్ధిదారులకు మెగాచెక్‌ను అందజేస్తున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 3: జిల్లాలో 2,76,008 మంది పింఛన్‌దారులకు జనవరి నెల నుంచి రూ.3వేల చొప్పున పింఛన్ పంపిణీ చేపట్టినట్లు జేసీ శ్రీనివాసులు తెలిపారు. సీఎం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో కలెక్టరేట్ నుంచి పాల్గొన్న అనంతరం రూ.80.90 కోట్ల మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ఈనెల నుంచి పెంచిన వైఎస్సార్ పింఛన్ కానుక మొత్తాన్ని రూ.3వేల చొప్పున లబ్ధిదారులకు వలంటీర్లు అందజేస్తారని చెప్పారు. జనవరి నెల నుంచి కొత్తగా 3937 మందికి పింఛన్లు మంజూరయ్యాయన్నారు. డీఆర్డీఏ పీడీ తులసి, చిత్తూరు మేయర్ అముద తదితరులు పాల్గొన్నారు.

22న ఓటర్ల జాబితా ప్రచురణ : డీఆర్వో



సమావేశంలో ప్రసంగిస్తున్న డీఆర్వో రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 3: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 22న ఓటర్ల జాబితా ప్రచురణ జరుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) ఎన్.రాజశేఖర్ అన్నారు. బుధవారం తన చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. డిసెంబరు 9వ తేదీవరకు అందిన క్లెయిమ్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామని చెప్పారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేవరకు మార్పులు-చేర్పులు, తొలగింపులు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందన్నారు. సార్వత్రిక ఎన్నికలకు పోలింగ్ శాతం పెంచేందుకు ఈనెల 25న పలుచోట్ల ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. పలు పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్కిల్ కాలేజీలో హెల్త్ కేర్ వర్కర్లకు శిక్షణ

చిత్తూరు (సెంట్రల్), జనవరి 3: 'హెల్త్ కేర్ వర్కర్లు, నర్సుల కోసం స్కిల్ కాలేజీలో శిక్షణ ఇస్తారు. అనంతరం అంతర్జాతీయ నియామకాలు చేపడతారు' అని డీఆర్‌డీఏ పీడీ తులసి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ ఇన్ ఏపీ (సీడాప్)లో బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసుకున్న గ్రామీణ యువతీ, యువకులకు జర్మనీలో ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు వివరించారు. విజయవాడలో నిర్వహిస్తున్న స్కిల్ కాలేజీలో 19-35 ఏళ్లలోపు అర్హులైన వారికి నాలుగు నెలల శిక్షణ ఇచ్చి, ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు. వివరాలకు ఈశ్వర్‌ను 93905 04650, సుదర్శన్‌రాజును 93905 04626 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాలివ్వండి: జేసీ

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 3: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాలను పంపాలని ఈఆర్వో, ఏఈఆర్వోలను జేసీ శ్రీనివాసులు కోరారు. బుధవారం సాయంత్రం అన్నిశాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికలకు సంబంధించి సూచించిన పనుల్లో నిర్లక్ష్యం లేకుండా సకాలంలో నివేదికలు అందించాలన్నారు. ఎండీయూ వాహనాల ద్వారా నిత్యావసర వస్తువుల పంపిణీ వేగవంతం చేయాలని, తప్పనిసరిగా వలంటీర్ల ద్వారా యాప్‌లో అప్‌డేట్ చేయడంతోపాటు ఫొటోలు పంపాలన్నారు. డీఆర్వో రాజశేఖర్, ఐసీడీఎస్, పౌరసరఫరాలశాఖ అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, డీటీలు, మున్సిపల్ కమిషనర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల్లో అవకతవకలు


విచారణ జరిపించాలంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు



పనుల వివరాలను తెలియజేయాలని హెచ్‌ఎంని కోరుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

పాలసముద్రం, జనవరి 3: పాలసముద్రం మండలంలోని ఎస్‌ఆర్ కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేపట్టిన నాడు - నేడు పను ల్లో అవకతవకలు జరిగాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులు మణికంఠన్, ఎత్తిరాజులు నాయుడు, వినోద్, సుధాకర్, దేవరాజులు పాఠశాలకు వెళ్లారు. అక్కడ పనులను పరిశీలించారు. ఎంత ఖర్చుపెట్టారో లెక్కలు తెలియజేయాలని హెచ్‌ఎం మనోహర్ నాయుడిని కోరారు. అలాగే ఈ విషయమై విచారించాలని వారు డీఈవోను కోరారు. ఇదిలా ఉంటే.. హెచ్‌ఎం తమను వేధింపులకు గురిచేస్తున్నారని ఉపాధ్యాయులు రెండ్రోజుల కిందట డిప్యూటీ సీఎం నారాయణస్వామికి, డీఈవో విజయేంద్రరావుకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ విషయాలపై హెచ్‌ఎం మాట్లాడుతూ.. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించడం లేదని, అడిగాననే తనపై ఉపాధ్యాయులు ఫిర్యాదు చేశారని హెచ్‌ఎం చెబుతున్నారు. రెండ్రోజుల్లో నాడు-నేడు పనుల లెక్కలు పాఠశాల కమిటీ ఎదుట ఉంచుతామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి మృతి



పుత్తూరు అర్బన్, జనవరి 3: పుత్తూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి మృతిచెందారు. ఎస్‌ఐ వెంకట మోహన్ కథనం మేరకు.. పుత్తూరు పట్టణం ఉత్తరపు కండ్రిగ దళితవాడకు చెందిన సుధాకర్ కుమారుడు దినకర్ (17) ఒక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం కళ్యాణపురం వైపు నడిచి వెళుతుండగా ఆరేటమ్మ ఆలయం క్రాస్ వద్ద వెనుక వైపు నుంచి లారీ ఢీకొంది. దీంతో అక్కడికక్కడే అతడు మృతి చెందాడు. ఎస్‌ఐ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కాంగ్రెస్‌తో టచ్‌లో 33మంది ఎమ్మెల్యేలు: చింతా

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 3: రాష్ట్రంలో 33మంది వైసీపీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నారని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ చెప్పారు. బుధవారం తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రానికి ప్రత్యేకహోదా కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. షర్మిల ధైర్యశాలి అని ఆమె పార్టీలోకి వచ్చాక పదవి గురించి ఆలోచిస్తామన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని ఏపీకి ఇన్‌ఛార్జిగా వేయాలని అధిష్ఠానానికి సూచిస్తానన్నారు. బయటకు చెప్పుకోలేని కొన్ని విషయాలను ఆటోబయోగ్రఫీలో రాస్తున్నానని, ఇందులో విస్మయం చెందే విషయాలు వెల్లడిస్తానన్నారు.

అందరి చూపూ జనసేన స్థానాల వైపే!



తిరుపతి సీటు ఎవరికి?

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అటు రాజకీయ వర్గాలతో పాటు ఇటు ప్రజానీకం కూడా వచ్చే ఎన్నికల్లో జనసేన పోటీ చేయనున్న స్థానాల పై ఆసక్తి కనబరుస్తున్నాయి. టీడీపీ, జనసేన పొత్తు నేపథ్యంలో జనసేన ఎన్ని స్థానాలు కోరుతుంది, ఏయే స్థానాలు కోరుతుంది అన్న దానిపై అందరూ ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రత్యేకించి బలిజ సామాజికవర్గం అధికంగా వున్న తిరుపతి, చిత్తూరు, మదనపల్లె అసెంబ్లీ స్థానాలతో పాటు రాజంపేట పార్లమెంటు స్థానంలో ఈ రెండు పార్టీల నిర్ణయం ఎలా వుంటుందన్న విషయమై ఇతరులతో పాటు టీడీపీ, జనసేన పార్టీల శ్రేణుల్లో కూడా ఆసక్తి నెలకొంటోంది. ప్రధాన పార్టీలు అభ్యర్థుల ఎంపికపై తీవ్ర స్థాయిలో కసరత్తు సాగిస్తున్న నేపథ్యంలో అన్ని వర్గాల్లో దీనిపై విస్తృత చర్చ నడుస్తోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

వైసీపీ అధిష్ఠానం అసెంబ్లీ, ఎంపీ స్థానాలపై శరవేగంగా నిర్ణయాలు తీసుకుని ప్రకటించేస్తున్న సంగతి తెలిసిందే. దానికి సమాంతరంగా టీడీపీ అధినేత చంద్రబాబు సైతం అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూడా కొద్ది రోజులనుంచీ దీనిపై సమాలోచనలు సాగిస్తున్నారు. టీడీపీ, జనసేన పార్టీల నడుమ పొత్తు వున్న కారణంగా రెండు పార్టీల అధినేతల నడుమా స్థానాల సర్దుబాట్ల గురించి స్పష్టత రావాల్సి వుంది. అధినేతలు దానిపై కసరత్తు జరుపుతున్నట్టు సమాచారం. కొద్ది రోజుల్లో దీనిపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశముంది. అయితే ఆ లోపు దీనిపై జిల్లావ్యాప్తంగా చర్చ ఎక్కువైంది. ముఖ్యంగా జనసేనకు కేటాయించే స్థానాలపై జనం ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. తిరుపతి, చిత్తూరు, మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గాలు, రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ పరిధుల్లో బలిజ సామాజికవర్గం బలంగా వున్న సంగతి తెలిసిందే. 2009 ఎన్నికల్లో చిరంజీవి ప్రజారాజ్యం తరపున తిరుపతి నుంచీ పోటీ చేసి గెలిచిన సంగతి తెలిసిందే. దీంతో ఈసారి పొత్తులో భాగంగా తిరుపతిని జనసేనకు కేటాయిస్తారన్న అంచనాలు పెరిగాయి.అలాగే పవన్ కళ్యాణ్ పోటీ చేయాలన్న డిమాండ్ కూడా జనసేన శ్రేణుల నుంచీ బలంగా వుంది. 3అయితే పవన్ కళ్యాణ్ పోటీ చేసే అవకాశాలు లేవు గానీ సీటు కోసం మాత్రం ఆ పార్టీ గట్టిగా పట్టుబడుతోందని సమాచారం.సీటు కేటాయించడానికి చంద్రబాబు సుముఖంగానే వున్నారని, కాకపోతే ఆ పార్టీ నుంచీ బలమైన అభ్యర్థి లేకపోవడాన్ని గుర్తు చేస్తున్నారని తెలిసింది. జనసేనకు కేటాయించాలంటే బలమైన అభ్యర్థిని అన్వేషించాలని, లేదంటే టీడీపీ నుంచే అభ్యర్థిని పోటీకి నిలపడం మంచిదని చంద్రబాబు భావిస్తున్నట్టు తెలిసింది. తిరుపతిలో టీడీపీకి ఎంత బలమున్నప్పటికీ, బలిజ సామాజికవర్గ ప్రాబల్యం వున్నప్పటికీ పోటీ చేసే అభ్యర్థి కూడా బలంగానే వుండాలని, అభ్యర్థిని ఆషామాషీగా తీసుకునే ప్రసక్తే లేదని చంద్రబాబు భావిస్తున్నట్టు సమాచారం. దీంతో తిరుపతి సీటు ఏ పార్టీ అభ్యర్థికి దక్కుతుందన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారుతోంది.

చిత్తూరుపైనా విస్తృత చర్చ

చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గంలో కూడా బలిజ సామాజికవర్గం రాజకీయంగా ప్రాబల్యం కలిగివుంది. ఇక్కడ కూడా టీడీపీ ఆ వర్గానికే ప్రాధాన్యత ఇస్తూ వస్తోంది. దీంతో ఈ సీటు కూడా పొత్తులో భాగంగా జనసేన పార్టీకి కేటాయిస్తారన్న ప్రచారం జరుగుతోంది. అయితే ఇక్కడ కూడా జనసేనకు బలమైన అభ్యర్థి దొరకడం కష్టంగా వుంది. కాకపోతే డీకే ఆదికేశవులు కుటుంబం నుంచీ ఎవరైనా జనసేనలో చేరి పోటీకి సిద్ధపడితే ఇబ్బంది వుండకపోవచ్చు. డీకే కుటుంబీకులు ముందుకు రాకుంటే జనసేనకు ఇక్కడ సీటు కేటాయించే అవకాశాలు తక్కువ.అయితే చిత్తూరులో ఎన్నికల రాజకీయాలు ఆఖరు నిమిషంలో అనూహ్యంగా మారడం పరిపాటి కావడంతో అక్కడ రానున్న రోజుల్లో ఏమి జరుగుతుందన్నది అంచనా వేయలేని పరిస్థితి నెలకొనివుంది.

మదనపల్లెలో అవకాశాలు అధికం

మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గంలో బలిజలు గణనీయ సంఖ్యలో వున్నారు. రాయలసీమ మొత్తం మీద జనసేనకు బలమైన నాయకత్వం వున్న నియోజకవర్గాల్లో ఇది మొదటిది. సొంత బలం కలిగిన గంగారపు రామ్‌దాస్ చౌదరి ఈసారి టికెట్ ఆశిస్తున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచీ చురుగ్గా పనిచేస్తున్నారు. బలిజ సామాజికవర్గంతో సన్నిహితంగా మెలగడంతో పాటు సొంత కమ్మ సామాజికవర్గంలోనూ పట్టు కలిగివున్నారు. ఇక్కడ రెండు పార్టీలూ కలిసి పనిచేస్తే గెలుపు సునాయాసం కానుంది. అనుకూలతలు అధికంగా వున్నందున ఉమ్మడి జిల్లాలో మదనపల్లె సీటు పొత్తులో జనసేనకే కేటాయిస్తారన్న అంచనాలు, ప్రచారం గత చాలాకాలం నుంచీ వున్నాయి. ఇక్కడ పొత్తు మీద జనసేనకు సీటు ఇస్తారా? ఇస్తే ఉమ్మడి అభ్యర్థిగా ఎవరికి అవకాశం వుంటుంది? ఏ సామాజికవర్గం నుంచీ అభ్యర్థి వుంటారు? అన్న అంశాలపై ఇపుడు తీవ్ర చర్చ నడుస్తోంది.

రాజంపేట పార్లమెంటు సీటుపైనా పెరిగిన ఆసక్తి

రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని పుంగనూరు, మదనపల్లె, పీలేరు, రాయచోటి, కోడూరు, రాజంపేట, తంబళ్లపల్లి తదితర మొత్తం ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలోనూ బలిజ సామాజికవర్గ ఓటర్లు గణనీయంగా వున్నారు. ప్రత్యేకించి పుంగనూరు, మదనపల్లె, పీలేరు, రాయచోటి, కోడూరు, రాజంపేటల్లో అత్యధికంగా వున్నారు. ప్రజారాజ్యం పార్టీ తరపున 2009లో కూడా ఇక్కడ డీకే ఆదికేశవులు కుమారుడు శ్రీనివాస్ పోటీ చేశారు. 2019లో టీడీపీ తరపున డీకే ఆదికేశవులు సతీమణి సత్యప్రభ పోటీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపధ్యంలో రాజంపేట ఎంపీ సీటును జనసేన గట్టిగా కోరే అవకాశముంది. తిరుపతి, చిత్తూరు అసెంబ్లీ సీట్ల తరహాలోనే ఇక్కడ కూడా జనసేనకు బలమైన అభ్యర్థులు ప్రస్తుతానికి అందుబాటులో లేరనే చెప్పాలి. డీకే ఆదికేశవులు కుటుంబం నుంచీ ఎవరైనా ముందుకొస్తే వైసీపీకి దీటైన పోటీ ఇవ్వడానికి ఆస్కారం వుంటుంది.బలిజ సామాజికవర్గంలో అత్యధికులు ఎలాగూ జనసేనకు మద్దతిస్తారు కాబట్టి రెడ్డి సామాజికవర్గం నుంచీ అభ్యర్థిని బరిలోకి దింపితే పోటీ హోరాహోరీగా వుంటుందని, గెలుపొందే అవకాశాలు కూడా వుంటాయని టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. ఎన్నికలకు కేవలం రెండు నెలలు మాత్రమే వ్యవధి వున్నందున టీడీపీ, జనసేన పొత్తుకు సంబంధించి ఈ నాలుగు స్థానాలపై రాజకీయ వర్గాల్లోనూ, సామాన్య ప్రజానీకంలోనూ ఆసక్తి పెరుగుతోంది.

ఇళ్లు పగుళ్లుబారుతున్నాయ్.. న్యాయం చేయండి!

జల్లి ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ఆందోళన ● దారికి అడ్డంగా కందకం తవ్విన తిమ్మాపురంవాసులు



దారికి అడ్డంగా తవ్విన కందకం వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కుప్పం, జనవరి 3: కుప్పం మండలం మిట్టపల్లె పంచాయతీ, తిమ్మాపురం సమీపంలోని జల్లి క్వారీవల్ల ఇబ్బంది పడుతున్న గ్రామీణులు బుధవారం రోడ్డెక్కారు. క్వారీ వాహనాలు తిరిగే దారికి అడ్డంగా కందకం తవ్వి ఆందోళనకు దిగారు. బాధిత గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. తిమ్మాపురం సమీపంలో స్థానిక వ్యక్తికి ఉన్న జల్లి క్వారీని తమిళనాడువారికి లీజుకు ఇచ్చారు. ఈ క్వారీతో తమకు నష్టం జరుగుతోందని, ఆస్తిపాస్తులు ధ్వంసమవుతాయని సబ్ కలెక్టర్‌కు, కలెక్టర్‌కు గ్రామస్తులు చాలాసార్లు ఫిర్యాదు చేశారు. ప్రజల ఆస్తిపాస్తులకు ఏదైనా నష్టం జరిగితే నష్టపరిహారం ఇస్తామని ఫ్యాక్టరీ యజమానులు అప్పట్లో హామీ ఇచ్చారు. అప్పట్నుంచి నడుస్తున్న జల్లి క్వారీతో తిమ్మాపురం గ్రామస్తులకు కష్టనష్టాలు ప్రారంభమయ్యాయి. ఎగిరి పడే కంకర రాళ్లతో ఇళ్ల గోడలు పగుళ్లుబారుతున్నాయి. గాలి కాలుష్యంతో తరచూ చిన్నపిల్లలు, వృద్ధులు అనారోగ్యం పాలవుతున్నారు. పశువుల కోసం తెచ్చిన బూసా (పశువుల మేత) దుమ్ము పడి పనికిరాకుండా పోతోంది. దీనిపై క్వారీ యజమానులను పలుమార్లు నిలదీసినా సరైన సమాధానం రాలేదు. చివరకు క్వారీలోని రాళ్లవల్ల ఇంటి గోడలు ధ్వంసమైన రామలింగం, సోముతోపాటు మరికొందరు గ్రామస్తులు, కొంతమంది ప్రజాప్రతినిధులను తీసుకుని బుధవారం ఫ్యాక్టరీ వద్దకు వెళ్లారు. తమ ఇళ్లు దెబ్బతిన్నాయని, నష్టపరిహారం చెల్లించాలని కోరారు. దీంతో తమకు సంబంధం లేదని, ఫ్యాక్టరీ నడుపుకొనేందుకు లైసెన్సు ఉందంటూ వారు సమాధానం ఇచ్చారు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు ఫ్యాక్టరీ వాహనాలు రాకపోకలు సాగించే దారి మధ్యలో ఎక్స్‌కవేటర్‌తో పెద్ద కందకం తవ్వి, అక్కడే ఆందోళన చేపట్టారు. పోలీసులు అక్కడికి చేరుకుని వారిని పక్కకు పంపేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా కొద్దిపాటి ఉద్రిక్తత తలెత్తింది. ఫ్యాక్టరీ యజమానులతో మాట్లాడి, న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

విజయవాడకు తరలిన టీడీపీ శ్రేణులు

ములకలచెరువు, జనవరి 3: ములకలచెరువు నుంచి టీడీపీ నేతలు రైలులో విజయవాడకు తరలివెళ్లారు. గురువారం జరగనున్న టీడీపీ జయహో బీసీ కార్యక్రమంలో పాల్గొనేందుకు టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ బీసీ సెల్ అధికార ప్రతినిధి ముత్తుకూరు మౌల, రాష్ట్ర సాధికార సమితి సభ్యులు కేశవులు, నేతలు నాగమల్లప్ప, నారాయణ, శ్రీనివాసులు, వేణుగోపాల్, ప్రభాకర్ వెళ్లారు.

గంగాద్రి మృతదేహం లభ్యం

పెద్దతిప్పసముద్రం జనవరి 3: పెద్ద చెరువులో చేపలవేటకు వెళ్లి గల్లంతైన గంగాద్రి అలియాస్ ధర్మా (23) మృతదేహం లభించింది. గల్లంతైన గంగాద్రి ఆచూకీ కోసం రెస్క్యూ ఆపరేషన్ టీం మంగళవారం సాయంత్రం వరకూ వెదికారు. ఆచూకీ కనపడక పోవడంతో మిన్నకుండి పోయారు. గజ ఈతగాళ్లు, మొలకలచెరువు అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, రెవెన్యూ అధికారులు విఫలయత్నాలు సాగించారు. బుధవారం ఉదయం స్థానికుల సహాయంతో ఎట్టకేలకు గంగాద్రి అలియాస్ ధర్మా మృతదేహాన్ని వెలికి తీశారు. గంగాద్రి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరై విలపించారు.

దాడి చేయడం అమానుషం : టీడీపీ



పరామర్శిస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా

ములకలచెరువు, జనవరి 3: బీజేపీ నేత గోపాల్‌రెడ్డిపై విచక్షణారహితంగా దాడి చేయడం అమానుషమని టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా పేర్కొన్నారు. బురకాయకోటలో ఇటీవల జరిగిన దాడిలో తీవ్రంగా గాయపడిన బీజేపీ నేతను బుధవారం టీడీపీ నేతలు పరామర్శించారు. తంబళ్ళపల్లె నియోజకవర్గ చరిత్రలో ఇలాంటి ఘటన ఎప్పుడూ జరగలేదని, దీన్ని ప్రతి ఒక్కరూ తీవ్రంగా ఖండిస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ కేవీ రమణ, నాయకులు కేశవులు, రమణమూర్తి, ఆది, నాగేంద్ర, ఉమాశంకర్, రెడ్డెప్ప, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం కావాలని హోమం

- తప్పక రావాలని కోరిన కట్టా దొరస్వామినాయుడు

కురబలకోట, జనవరి 3: జరగనున్న ఎన్నికల్లో టీడీపీ అధినేత నారా చంద్రబాబు సీఎం కావాలని హోమం చేస్తున్నాం, తప్పనిసరిగా రావాలని పలువురు టీడీపీ నేతలను టీఎస్ఎన్వీ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్టా దొరస్వామినాయుడు ఆహ్వానించారు. ఈనెల 6,7,8 తేదీల్లో మదనపల్లెలో చంద్రబాబు సీఎం కావాలని దశమహావిద్యా సమేత మహారాజ శ్యామల, చండీ హోమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రముఖ పండితులు శాస్త్రోక్తంగా హోమం, అన్నదానం నిర్వహిస్తున్నారు. ఈ హోమానికి పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసుల రెడ్డి, టీడీపీ రాజంపేట ఇన్‌చార్జ్ జగన్‌మోహన్ రాజు, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, లక్కిరెడ్డిపల్లె రమేష్‌రెడ్డి, మండపల్లి రాంప్రసాద్‌రెడ్డి తదితరులను ఆహ్వానించారు. ఈ హోమానికి టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.



పరిటాల శ్రీరామ్‌ను ఆహ్వానిస్తున్న కట్టా దొరస్వామినాయుడు

షర్మిలను కలిసిన సింగం రామకృష్ణారెడ్డి



షర్మిలతో మాట్లాడుతున్న సింగం రామకృష్ణారెడ్డి

మదనపల్లె అర్బన్, జనవరి 3: షర్మిలను మర్యాద పూర్వకంగా మదనపల్లె కాంగ్రెస్ నేత సింగం రామకృష్ణారెడ్డి కలిశారు. బుధవారం ఇడుపులపాయిలో షర్మిలను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మదనపల్లెలో పార్టీ బలోపేతం, రాజకీయ పరిస్థితులను వివరంగా చర్చించారు. తాము మదనపల్లె నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతానికి కృషి చేస్తున్నట్లు ఆయన వివరించారు. పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తెంగాణలాగా ఆంధ్రలో కూడా కాంగ్రెస్ పార్టీ 2024 సార్వత్రిక ఎన్నికల్లో విజయకేతనం ఎగరవేయడానికి కృషి చేస్తామన్నారు. 2024లో రాహుగాంధీని ప్రధానిగా చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఈశ్వర్, పవన్ కుమార్‌రెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

మిట్స్ విద్యార్థులకు జిందాల్ స్కాలర్‌షిప్పులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సి.యువరాజ్

కురబలకోట, జనవరి 3: అంగళ్ళు సమీప మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు జిందాల్ స్కాలర్ షిప్పులు మంజూరైనట్లు ప్రిన్సిపాల్ సి.యువరాజ్ పేర్కొన్నారు. కళాశాలలో 32 మంది ఎంసీఏ విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు మంజూరయ్యారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.3 లక్షల నుంచి లక్ష రూపాయల చొప్పున స్కాలర్‌షిప్పులు మంజూరైనట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కరెస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి, ప్రిన్సిపాల్ యువరాజ్, అత్తర్ సమీనాఖాన్, మౌలాలి తదితరులు అభినందించారు.

రేషన్ సరుకులను సక్రమంగా ఇవ్వాలి : జేసీ

గుర్రంకొండ, జనవరి 3: ప్రజలకు సరఫరా చేసే రేషన్ సరుకులను సక్రమంగా ఇవ్వాలని జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ సిబ్బందికి సూచించారు. గుర్రంకొండ-2, మామిళ్ల వారిపల్లె రేషన్ దుకాణాలను తనిఖీ చేసిన ఆయన ప్రజలకు సరఫరా చేస్తున్న బియ్యం, చక్కెర స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. రేషన్ దుకాణాల్లో కందిపప్పు ఎన్ని నెలలుగా ఇవ్వడం లేదని ఆరాతీశారు. ప్రజలకు అన్ని రకాల రేషన్ సరుకులు అందేలా చూడాలని సీఎస్‌డీటీ నారాయణరెడ్డికి సూచించారు. అనంతరం ఎండీయూ వాహనాల ద్వారా బియ్యం పంపిణీని పరిశీలించారు. ప్రజల ఇళ్ల వద్దకే బియ్యం సరఫరా చేసేలా సిబ్బంది పని చేయాలని తెలిపారు.



రేషన్ షాప్‌ను తనిఖీ చేస్తున్న జేసీ

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

మదనపల్లె అర్బన్, జనవరి 3: స్థానిక జడ్పీహైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం ఉచితంగా ట్యాబ్‌లను స్థానిక ఎమ్మెల్యే నవాజ్‌బాషా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆధునాతన విద్యను అభ్యసించేందుకు విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేశామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడి అడ్డగింత

పోలీసుల అదుపులో అంగన్వాడీలు ● అండగా కాంగ్రెస్, జనసేన నేతలు

● అంగన్వాడీలకు మద్దతుగా పోలీసు స్టేషన్‌లో ధర్నా చేపట్టిన కాంగ్రెస్ నేతలు

అంగన్వాడీలు చేపడుతున్న కలెక్టరేట్ ముట్టడిని పోలీసులు తమదైనశైలిలో అడ్డుకున్నారు. ఎక్కడికక్కడ జిల్లా కేంద్రాల్లో కలెక్టరేట్ల ముట్టడి చేపట్టాలని రాష్ట్ర నేతల పిలుపునిచ్చారు. అన్నమయ్య జిల్లా రాయచోటి కలెక్టరేట్ ముట్టడి చేపట్టాలని అంగన్వాడీలు నిర్ణయించారు. మదనపల్లె, నిమ్మనపల్లె, పీలేరు, కురుబలకోట, తంబళ్లపల్లె, గుర్రంకొండ, కలికిరి, కలకడ, వాల్మీకిపురం తదితర ప్రాంతాల నుంచి అంగన్వాడీలు కదిలారు. వచ్చే వారిని ఎక్కడికక్కడ బస్టాండ్ల వద్ద పోలీసులు కాపుకాచి మరీ వారిని అదుపులోకి తీసుకున్నారు. మరికొందరిని వచ్చిన ప్రాంత పోలీసులకే అప్పగించారు. కాంగ్రెస్, జనసేన నేతలు మద్దతుగా నిలిచారు. ఒకానొక దశలో అంగన్వాడీలను వదిలేవరకు పోరాడతామని కాంగ్రెస్ నేతలు పోలీసు స్టేషన్‌లో బైఠాయించారు. వివరాల్లోకెళితే....







మదనపల్లె తాలూకా పోలీస్‌స్టేషన్‌లో అంగన్వాడీలకు మద్దతుగా మాట్లాడుతున్న జనసేన నేత గంగారపు రామ్‌దాస్‌చౌదరి - ఆరోగ్యవరం వద్ద రోడ్డుపైనే దించేసిన పోలీసులు - కురబలకోటలో అంగన్‌వాడీలను అడ్డుకున్న పోలీసులు

మదనపల్లె, జనవరి 3: అంగన్వాడీలకు జనసేన అండగా ఉంటుందని జనసేన రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రామ్‌దాస్‌చౌదరి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రానికి వెళ్తున్న అంగన్వాడీలను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌లో నిర్బంధించడం ఏమిటని ప్రశ్నించారు. తాలూకా పోలీస్ స్టేషన్‌లో అంగన్వాడీలకు మద్దతుగా ఆయన మాట్లాడుతూ ప్రజావ్యతిరేకతను మూటగట్టుకున్న ప్రభుత్వానికి, సైకో జగన్‌కు రోజులు దగ్గర పడ్డాయన్నారు. అంగన్వాడీల ఇబ్బందులు, బాధలను జనసేన అధినేత పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. మరో మూడునెలల్లో జనసేన-టీడీపీ ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు కానుందని ఆయన భరోసా ఇచ్చారు. జనసేన ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరాం, చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడపా సురేంద్ర, పార్టీ పట్టణ అధ్యక్షుడు జగదీష్, ప్రధాన కార్యదర్శి కావలి రెడ్డెమ్మ, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, పట్టణ ప్రధాన కార్యదర్శి నవాజ్, లవన్న, పురం నగేష్, గంగులప్ప, పవన్, శంకర్, జవిలి మోహన్‌కృష్ణ, జస్వంత్ పాల్గొన్నారు.

వదలాలని కాంగ్రెస్ నేతల పట్టు

మదనపల్లె టౌన్, జనవరి 3: అంగన్వాడీల నిరవధిక సమ్మెలో భాగంగా మదనపల్లె అంగన్వాడీలు రాయచోటి కలెక్టరేట్ ముట్టడికి వెళుతున్న వారిని పోలీసులు అడ్డుకుని, అరెస్టు చేసి తాలూకా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అంగన్వాడీలను వదలాలని కాంగ్రెస్ నేతలు పట్టుబట్టడమే కాక, పోలీసుస్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. మదనపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 65 మంది అంగన్వాడీలు ఉదయం ఒక బస్సులో రాయచోటి కలెక్టరేట్ ముట్టడికి బయలుదేరారు. విషయం తెలుసుకున్న మదనపల్లె తాలూకా పోలీసులు ఆరోగ్యవరం వద్ద బస్సును అడ్డగించి అంగన్వాడీలను దించేశారు. ఆగ్రహించిన అంగన్వాడీలు అక్కడే ధర్నాకు దిగారు. వారిని పోలీసులు తాలూకా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు వెళుతుంటే పోలీసులు అరెస్టు చేయడం దారుణమని అంగన్వాడీలు స్టేషన్ ఆవరణలో బైఠాయించారు. మదనపల్లె పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ రెడ్డి సాహెబ్, మండల అధ్యక్షుడు వై. సురేంద్రారెడ్డి, తంబళ్లపల్లె కాంగ్రెస్ నేత నాని తమ అనుచరులతో అక్కడికి చేరుకుని అంగన్వాడీలకు మద్దతుగా ధర్నాలో కూర్చొన్నారు. ఉదయం నుంచి తాగునీరు, టిఫిన్ లేకుండా అంగన్వాడీలు ఆకలితో అలమటిస్తుంటే పోలీసులు కనికరం చూపకుండా, వారిని అరెస్టు చేయడం దారుణమని రెడ్డి సాహెబ్ అన్నారు. అంగన్వాడీలను వదిలే వరకూ తామూ స్టేషన్‌లోనే ధర్నా కొనసాగిస్తామని నినాదాలు చేశారు. తాలూకా ఎస్ఐ సుధాకర్, సిబ్బందితో వెళ్లి కాంగ్రెస్ నేతలు, అంగన్వాడీలను బతిమాలినా వారు పట్టువదల్లేదు. కాంగ్రెస్ నేతలను బయటకు పంపేందుకు పోలీసులు యత్నించగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వన్‌టౌన్ సీఐ వల్లీబషు కాంగ్రెస్ నేతలను బుజ్జగించి ధర్నా విరమించేలా చేశారు. అంగన్వాడీలను సొంత పూచికత్తుపై విడుదల చేశారు. సీఐటీయూ నాయకురాళ్లు గంగాదేవి, సుజన, అంగన్వాడీలు, కాంగ్రెస్ నేతలు ఎస్‌కే బాషా, మిట్టపల్లె బాబు, మహబూబ్ పీర్, పాలేటి, అన్వర్, సయ్యద్, అబ్రాజ్, బయ్యారెడ్డి, మహమ్మద్ అలి, శరత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌కు తరలింపు

నిమ్మనపల్లి, జనవరి 3: అంగన్వాడీ కార్యకర్తలు వారి సమస్యలు వినిపించేందుకు కలెక్టర్ కార్యాలయ ముట్టడికి వెళుతుంటే వారి అడ్డుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించడంపై అంగన్వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీ కార్యకర్తలు కలెక్టరేట్ ముట్టడికి నిమ్మనపల్లి నుంచి బస్సులో వెళుతుండగా కలకడ వద్ద పోలీసులు వారిని ఆపి నిమ్మనపల్లి పోలీసులకు అప్పగించారు. ప్రశాంతంగా నిరసనలు తెలియచేస్తుంటే అరెస్టులు చేయడం సమంజసం కాదన్నారు. తమ డిమాండ్‌లు పరిష్కరించే వరకూ తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. ముంతాజ్, రెడ్డెమ్మ, శ్యామల, కల్పన తదిరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను అడ్డుకున్న పోలీసులు

కురబలకోట, జనవరి 3: అంగన్‌వాడీలను పోలీసులు అడ్డుకున్నారు. అన్నయమ్మ జిల్లా రాయచోటి కలెక్టరేట్ ముట్టడికి వెళుతుండగా అంగళ్ళులోని కడప రోడ్డులో అంగన్‌వాడీలను అడ్డుకుని స్టేషన్‌కు తరలించారు.

పూలే జీవితం స్ఫూర్తిదాయకం





సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏపీ వాల్మీకిసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులిశ్రీనివాసులు జ్ఞానాంబిక ప్రిన్సిపాల్ రమాదేవిని సన్మానిస్తున్న బహుజన యువసేన నేతలు

మదనపల్లె, జనవరి 3: మనుస్మృతి అమలు చేసిన దుర్మార్గమైన చట్టాలను మంటలకు ఆహుతి చేసిన క్రాంతి జ్యోతి మాతా సావిత్రిబాయి పూలే అని వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ పేర్కొన్నారు. అంబేద్కర్ సర్కిల్ వద్ద వీసీకేపార్టీ, భారతీయ అంబేద్కర్ సేన ప్రతినిధులు సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. వీసీకే నేతలు ముత్యాల మోహన్, బురుజు లక్ష్మీనారాయణ, నీరుగట్టి వెంకటరమణ, జి.మనోహర్‌రెడ్డి, పి.శంకర్, చిన్న, సద్దల శివకుమార్, రాయల్ సూర్య, బురుజు రెడ్డిప్రసాద్, హైదర్ వలి, డి.మోహన్, పవన్‌తేజ పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకి ఘన నివాళి

బహుజన యువసేన(బీవైఎస్) అధ్యక్షుడు పునీత్ కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. బీవైఎస్ నేతలు సతీష్, హరీష్, మహేష్, ఆది, రాయల్ నవీన్, నితీష్, జగదీష్, పూర్ణ, బాలు పాల్గొన్నారు.

పట్టణంలో పలుచోట్ల నివాళులు

మదనపల్లె అర్బన్, జనవరి3: పూలే జయంతి వేడుకలు పట్టణంలో పలు చోట్ల నిర్వహించారు. అంబేద్కర్ సర్కిల్‌లో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి పీటీఎం శివప్రసాద్ నివాళులర్పించారు. ఆధునిక భారత తొలిమహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రిబాయిపూలే భారతదేశ చరిత్రపుటల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో బీసీ హక్కుల పోరాటసమితి సభ్యులు వైవీశేఖర్, గురుమూర్తి, రామలింగ, నాగరాజ, సమితి రాష్ట్రఅధ్యక్షుడు బోడెం రాజశేఖర్ సావిత్రిబాయిపూలే చిత్రపటానికి నివాళులర్పించారు. స్థానిక ప్రైవేట్ పంక్షన్‌హాల్‌లో బీఎస్పీ నేతలతో సమావేశమై జ్యోతి రావుపూలే, సావిత్రిబాయి పూలే, కాన్షీరాం చిత్రపటాలకు బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండెల గౌతమ్‌కుమార్ నివాళులర్పించారు. దేవతానగర్‌లోని చైతన్య ఆశ్రమంలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. సావిత్రిబాయి పూలే వేషధారణలో విద్యార్థులు ప్రదర్శన చేశారు. ఏపీ వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఆమె చిత్రపటానికి నివాళులర్పించిన రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాసులు మాట్లాడుతూ సనాతన ధర్మం, సంప్రదాయాలు, కట్టుబాట్లతో మహిళా లోకం వివక్షతను చూసి చలించిపోయిన సావిత్రి బాయి విద్యతోనే మహిళా అభ్యుదయం సాధ్యమని తాను విద్యను నేర్చుకుని తద్వారా మహిళలకు న్యాయం కోసం పోరాటం చేశారని గుర్తు చేశారు. బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ బాలకృష్ణ మూర్తి, బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు సంయుక్తంగా పూలే జయంతి నిర్వహించారు. మహిళాభివృద్ధి కోసం జీవితాన్నే త్యాగం చేసిన త్యాగశీలిగా పేర్కొన్నారు. అధ్యాపకురాలు, విద్యార్థులు బహుజన సేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో...

మదనపల్లె టౌన్, జనవరి 3: సావిత్రిబాయి పూలేని ఆదర్శంగా తీసుకోవాలని బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్‌కుమార్ పేర్కొన్నారు. జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంత్యుత్సవాల్లో బాలికలు క్రమశిక్షణతో మెలిగేలా ప్రోత్సహిస్తున్న ప్రిన్సిపాల్ ఎస్.రమాదేవి, అధ్యాపకురాలు రమ్య, కవిత, మాధవిని సన్మానించారు. బహుజన యువసేన నాయకులు సతీష్, హరీష్, మహేష్, ఆదిరాయల్, నవీన్, జగదీష్, పూర్ణబాలు పాల్గొన్నారు. స్థానిక బాపూజీ మున్సిపల్ హైస్కూల్‌లో ఫోర్డు సంస్థ ఆధ్వర్యంలో జ్యోతిరావుపూలే జయంతి నిర్వహించారు. సంస్థ కోఆర్డినేటర్ రాధారాణి, విద్యార్థులు పాల్గొన్నారు. బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూలే జయంతి నిర్వహించారు. డాక్టర్ శైలజ, శ్రీదేవి, ప్రిన్సిపాల్ ఆనందరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

పీలేరులో ప్రజాసంఘాలు...

పీలేరు, జనవరి 3: దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే జయంతిని పీలేరు పట్టణం, అగ్రహారం ఎస్టీ కాలనీలో పలు ప్రజాసంఘాలు నిర్వహించాయి. ఆమె చిత్రపటాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బలరాం, బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ సభ్యులు సయ్యద్ అలీ, ఎన్టీఆర్ నఫీస్, రవి, రామచంద్ర, శివ, దళిత సంఘాల నేతలు రాజమ్మ, గట్టప్ప, పాలకుంట శ్రీనివాసులు, ధరణీకుమార్, మచ్చారెడ్డయ్య, రాష్ట్ర గిరిజన సమాఖ్య నేత కిల్లా విజయ్ కుమార్, వ్యవసాయ సంఘ అధ్యక్షులు సురేంద్ర, మల్లికార్జున, హరినాథ, గురవయ్య, ఎంఎస్‌పీ నేత గండికోట వెంకటేశ్, నేతలు పాల్గొన్నారు.

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో...

వాల్మీకిపురం, జనవరి 3: భారతదేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త, సామాజిక ఉద్యమ కారిణి పూలే జయంతి వేడుకలను జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. మైనార్టీ బాలికల కళాశాలలో పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ రమామంజుల, రెడ్డెమ్మ, పాల్గొన్నారు.

సమ్మెలోకి మున్సిపల్ పారిశుధ్య కార్మికులు

మద్దతుగా నిలిచిన టీడీపీ, జనసేన



శిబిరంలో టీడీపీ, జనసేన నేతలు మస్తాన్, శ్రీరామ రామాంజనేయులు, దారం అనిత

మదనపల్లె, జనవరి 3: ముందుగా ప్రకటించినట్లే మున్సిపల్ పారిశుధ్య కార్మికులు బుధవారం సమ్మె బాటపట్టారు. విధులు బహిష్కరించిన కాంట్రాక్టు, రోజువారి వేతన కార్మికులు 250 మంది స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉదయం నుంచీ సాయంత్రం వరకూ సమ్మె నిర్వహించారు. తమ న్యాయపర డిమాండ్లు పరిష్కరించే వరకూ ఆందోళనలో పాల్గొంటామని యూనియన్ నేతలు ప్రకటించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏఐటీయూసీ, జాయింట్ యాక్షన్‌కమిటీ మద్దతుతో సమ్మెకు శ్రీకారం చుట్టారు. కార్మికసంఘం, ఏఐటీయూసీ నేతలు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ పర్మనెంట్ శానిటరీ కార్మికులకు సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులను పర్మనెంట్ చేయాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఎన్నికల్లో పాలకులు ఇచ్చిన హామీలు, అమలు చేయకపోవడాన్ని ప్రస్తావిస్తూ, అటు ప్రజాప్రతినిధులు, ఇటు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.మస్తాన్, ఏఐటీయూసీ నేతలు ఎస్.ముబారక్, నాగరాజ, తిరుమలప్ప, దేవ, అమర్, పృధ్వీరాజ్, ఇంద్రాణి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన మద్దతు

మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులకు టీడీపీ, జనసేన నేతలు మద్దతు తెలిపారు. ఇందులో భాగంగా వారికి సంఘీభావంగా శిబిరంలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా, కార్మికులకు అనుకూలంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. టీడీపీ మైనార్టీ సీనియర్ నేత ఎస్.ఎ.మస్తాన్, జనసేన నియోజకవర్గ నేత శ్రీరామ రామాంజనేయులు, జనసేన ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి దారం అనిత కార్మికులకు ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని వివరించారు. కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకుడు దారం హరిప్రసాద్, స్టూడెంట్ విభాగం అధ్యక్షుడు సుప్రీంహర్ష, సోను, అశ్వత్, గణేష్, రూప బహదూర్, తదితరులు పాల్గొన్నారు.

6న ఉచిత గుండె వైద్య శిబిరం

పీలేరు, జనవరి 3: ఈ నెల 6న పీలేరులో ఉచిత గుండె, నరాల వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ పీలేరు ప్లాటినమ్ అధ్యక్షులు శ్రీహరి రెడ్డి తెలిపారు. పీలేరు-కడప రోడ్డులోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేయనున్న ఈ వైద్య శిబిరంలో బెంగళూరులోని వైదేహి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, హృద్రోగ విభాగం సీనియర్ వైద్యులు డాక్టర్ దుర్గాప్రసాద్ రెడ్డి పాల్గొంటారని ఆయన తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చే వారు తమ ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వివరాలకు 9440485147 సంప్రదించాలని తెలిపారు.

సారా కేసులో వ్యక్తి అరెస్టు

కలకడ, జనవరి 3: బాలయ్యగారిపల్లె పంచాయితీ వడ్డిపల్లె వద్ద అక్రమంగా సారాను తరలిస్తున్న క్రిష్ణయ్యను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. అతని నుంచి పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఏఎస్ఐ బాలకృష్ణ, హెచ్‌సీ రెడ్డిబాబు, కరుణాకర్‌లు పాల్గొన్నారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఏకగ్రీవం

మదనపల్లెఅర్బన్, జనవరి 3: ఎస్టీయూ మండల నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆసంఘం రాష్ట్రఅధ్యక్ష, కార్యదర్శులు పోకల మధుసూదన, ఆర్‌వీ రమణ తెలిపారు. ఎస్టీయూ మదనపల్లె మండల సమావేశంలో అధ్యక్షుడిగా జి. చంద్రశేఖర్, గౌరవాధ్యక్షుడిగా చలపతి, ప్రధాన కార్యదర్శిగా గోపాల్‌నాయక్, ఆర్థిక కార్యదర్శిగా చంద్రశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో ఎస్టీయూ నేతలు గిరిధర్ నాయక్, నరసింహులు, చలపతి, ఉదయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు

రామసముద్రం, జనవరి 3: జూనియర్ కళాశాల విద్యార్థిని విద్యార్థులకు మాదక ద్రవ్యాలు, మత్తు వ్యసనాలపై అవగాహన నిర్వహించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని ఎస్ఐ చంద్రశేఖర్ అన్నారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపాల్ మురళీధర్, హెడ్ కానిస్టేబుల్ చంద్రరాజు, మోహన్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రతి మహిళా లక్షాధికారి కావాలి

మదనపల్లె టౌన్, జనవరి 3: మండల సమాఖ్య సభ్యులు ప్రతి మహిళా లక్షాధికారి కావాలని వెలుగు డీపీఎం(ఫైనాన్స్)ప్రసాదరెడ్డి పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో 'లఖ్‌పతి దీదీ'పై మహిళా సమాఖ్య సభ్యులకు నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మహిళలు ఎంచుకున్న జీవనోపాదులపై శిక్షణ ఇచ్చారు. ఒక్కో కుటుంబానికి నెలకు రూ.10వేలు ఆదాయం చేకూరేలా జీవనోపాదులను ఎంచుకోవాలన్నారు. మాస్టర్ ట్రైనర్ గంగార్జున, కిజర్, వెలుగు సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

చెరువుకింది భూములకు దారి వదలండి



సబ్‌కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీటీఎం పెద్దచెరువు ఆయకట్టు రైతులు

మదనపల్లె టౌన్, జనవరి 3: సీటీఎం పెద్దచెరువు కింది భూములకు వెళ్లేందుకు దారి వదలాలని రైతులు డిమాండ్ చేశారు. స్థానిక సబ్ కలెక్టరేట్ ఎదుట సీటీఎం, మేకలవారిపల్లె, అండేవారిపల్లె గ్రామాల రైతులు ధర్నా నిర్వహించారు. పెద్దచెరువు కింద 1000 ఎకరాల ఆయకట్టు భూములున్నాయన్నారు. నాలుగేలన్ల జాతీయరహదారి ఏర్పాటుతో పంట కాల్వలు పూడి పోయాయన్నారు. దిగుబడులు ఇళ్ల వద్దకు రవాణా చేసేందుకు బండి బాటకూడా లేదన్నారు. నడిచే దార్లు కూడా రెవెన్యూ రికార్డుల్లో లేవని మూసి వేశారన్నారు. రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆర్డీఓ క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం సబ్‌కలెక్టరేట్ డీఏఓ శేషయ్యకు వినతి పత్రం అందజేశారు. నరసింహులు, వెంకటరమణ, సుబ్రమణ్యం, రవీంద్ర పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

పెద్దమండ్యం, జనవరి 3: టెన్త్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు సెక్రెటరీ నాగమునిరెడ్డి పిలుపు నిచ్చారు. పెద్దమండ్యం జడ్పీ హైస్కూల్‌లో బుధవారం టెన్త్ పబ్లిక్ పరీక్షలపై అవగాహన, సంసిద్ధత, విజయస్ఫూర్తి కార్యక్రమాలు, ఒక రోజు ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదివి పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. పబ్లిక్ పరీక్షల్లో వత్తిడికి లోను కాకుండా చూసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి పదికి పది పాయింట్‌లు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పెద్దమండ్యం ఎంఈఓలు మనోహర్, రామకృష్ణ, ప్రత్యేక తరగతి నిర్వాహకులు రామూర్తి, బీఎస్ఆర్ సుధాకర్‌రెడ్డి, రజనికాంత్, ఫోర్డు సంస్థ కార్యదర్శి నరసింహులు, మండల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

గుర్రంకొండ, జనవరి 3: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పీలేరు నియోజకవర్గ ఎన్నికల అధికారి గోపాలకృష్ణ పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. గ్రామాల్లో ఓటు ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయాలన్నారు. అనంతరం బూత్‌ల వారీ ఓటర్ వివరాలను అడిగి తెలుసుకున్నారు.

అర్బన్‌హెల్త్ సెంటర్లు ప్రారంభం

మదనపల్లె, జనవరి 3: మున్సిపాలిటీలో రూ.3కోట్లతో నిర్మించిన రెండు అర్బన్ హెల్త్ సెంటర్లను ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా ప్రారంభించారు. త్యాగరాజవీధి సెంటర్‌ను స్థానిక పశువుల ఆస్పత్రి ఆవరణలో, మోతీనగర్ హెల్త్‌కేంద్రాన్ని హంద్రీ-నీవా కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేశారు. ఈ రెండు కేంద్రాలను నేషనల్ హెల్త్ మిషన్ 2020-21 కింద కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా, మున్సిపాలిటీ వీటికి స్థలాలను కేటాయించింది. ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, పట్టణంలో అర్బన్‌హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే అన్నారు.

గిఫ్ట్‌స్కీమ్‌లో ప్రయాణికులకు బహుమతుల అందజేత

మదనపల్లెఅర్బన్, జనవరి 3: గాలివీడు రోడ్డులో ప్రయాణించిన వారికి గిఫ్ట్‌స్కీమ్‌లో బహుమతులను అందించిన్నట్లు టూడిపోమేనేజరు నిరంజన్ తెలిపారు. బుధవారం ఆర్టీసీ బస్టాండ్‌లో లక్కీడిప్ ద్వారా ప్రయాణికులను ఎంపిక చేసి వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ ఆర్టీసీకి ఆదాయం పెంచడానికి, ప్రయాణీకులు ఆర్టీసీలో ఎక్కువగా ప్రయాణించడానికి ఈ లక్కీడిప్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్‌మేనేజరు గీతా, ఆర్టీసీ ఉద్యోగులు, ప్రయాణీకులు తదితరులు పాల్గొన్నారు.